www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, 12.05.2024
హైదరాబాద్
సంపుటి: 2, సంచిక: 211

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక




## వేగంగా... హైరైజింగ్

- నగరంలో విస్తరిస్తున్న ఆల్ట్రా మోడ్రన్ ప్రాజెక్టులు
- శరవేగంతో భారీ హైరైజ్ ప్రాజెక్టుల నిర్మాణం



## బీఆర్ఎస్, బీజేపీని నమ్మి

# మోసపోవద్దు


02

- డబుల్ ఆర్ అంటే రాహుల్, రేవంత్ ఈ ఇద్దరూ ప్రజల కోసం తపించే లీడర్స్
- ఆ నేతలకు అండగా ఉండాల్సిన అవసరం ఉన్నది
- ఈ లోక్ సభ ఎన్నికలు చాలా కీలకం
- ప్రజలు ఆలోచనతో ముందుకు వెళ్లాలి
- రాజ్యాంగాన్ని మోదీ రాయలేదు
- రద్దు చేస్తే ఊరుకునేది లేదు
- ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ

## కాంగ్రెస్ 50 సీట్లు కూడా

# గెలవదు



- ఎన్నికల తర్వాత ప్రతిపక్ష హోదా కోల్పోతుంది
- దేశ ప్రతిష్టను పెంచిన పోఖ్రాన్ పరీక్షలు
- 500 ఏళ్ల ప్రజల నిరీక్షణకు బీజేపీ తెరదించింది
- ఒడిశాలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం
- అణ్వాయుధాలతో పాక్ వ్యాపారం
- కాంగ్రెస్ బలహీనమైన వైఖరితోనే కశ్మీర్ సమస్య
- ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:** ప్రస్తుతం దేశంలో జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 50 స్థానాలు కూడా గెలవదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఎన్నికల తర్వాత ప్రతిపక్ష హోదా కూడా కోల్పోతుందని తెలిపారు. ఒడిశాలోని కందమాల్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. 26 ఏళ్ల క్రితం ఇదే రోజున అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో చేపట్టిన పోఖ్రాన్ పరీక్షలు ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్టను పెంచాయన్నారు. అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించడం ద్వారా 500 ఏళ్ల ప్రజల నిరీక్షణకు బీజేపీ ప్రభుత్వం తెరదించిందని తెలిపారు. ఒడిశాలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతుందని, ఒడియా భాష, సంస్కృతిని అర్థం చేసుకున్న వారినే సీఎంను చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ పాకిస్థాన్‌ను గౌరవించండి అని చేసిన వ్యాఖ్యలపై మోడీ స్పందించారు. ఆర్థిక సమస్యల కారణంగా భారత్‌కు దూరమైన పొరుగు దేశం తన అణ్వాయుధాలను విక్రయించాలని చూస్తోందని తెలిపారు. పాకిస్తాన్ అణు బాంబులతో దేశ ప్రజలను భయపెట్టడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పాక్‌లో అణుబాంబులు ఉన్నాయని కాంగ్రెస్ చెబుతోంది. కానీ ఆ బాంబును ఎలా నిర్వహించాలో కూడా తెలియని పరిస్థితిలో పాక్ ఉంది. తమ బాంబులను అమ్మడానికి వారు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ బలహీనమైన మిగతా 2లో




## 2 లక్షల రుణమాఫీ

# రుణం తీర్చుకుంటా

- ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి


వివరాలు 2లో

## ప్రచారంలో దూసుకుపోతున్న వెంకట్రామిరెడ్డి

వివరాలు 4లో

## ఎన్నికలకు సర్వం సిద్ధం

వివరాలు 2లో

## కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించబోతోంది



- ఆ పార్టీపై ప్రజల ఆగ్రహంతో ఉన్నరు
- రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ తక్కువ దృష్టి పెట్టి
- అసెంబ్లీలో శ్వేత పత్రాల పేరిట చిల్లర రాజకీయాలు
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు అత్యధిక సీట్లు
- రెండు జాతీయ పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతరు
- ముఖ్యమంత్రివి చిల్లర రాజకీయాలు
- బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించబోతోందని, ఆ పార్టీపై ప్రజల ఆగ్రహంతో ఉన్నారని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ పాలనపై మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అత్యధిక మిగతా 2లో

# బీఆర్ఎస్, బీజేపీని నమ్మి మోసపోవద్దు





**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్‌లో డబుల్ ఆర్ అంటే రాహుల్, రేవంత్ అని ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరూ ప్రజల కోసం తపించే లీడర్స్ అని, ఆ నేతలకు అండగా ఉండాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. శనివారం ఆమె వికారాబాద్ జిల్లాలోని తాండూరు, కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ మాట్లాడుతూ...ఈ లోక్ సభ ఎన్నికలు చాలా కీలకమన్నారు. ప్రజలు ఆలోచనతో ముందుకు వెళ్లాన్నారు. బీజేపీని నమ్మి మరోసారి మోసపోవద్దని పిలుపు నిచ్చారు.

## పేద ప్రజలకు అండగా..

పేద ప్రజలకు అండగా తమ కుటుంబం పనిచేస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు చైతన్య వంతులని, అసెంబ్లీ ఎన్నికల్లో మద్ధతు ఇచ్చినట్లే, లోక్ సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కు సపోర్టుగా ఉండాలని కోరారు. తెలంగాణతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉన్నదని ప్రియాంక గుర్తు చేశారు. ఇందిరాగాంధీని తెలంగాణ ప్రజలు గుండెల్లో పెట్టి చూసుకున్నారన్నారు. ఆ తర్వాత సోనియమ్మపై అభిమానం చూపించారని ఆనందం వ్యక్తం చేశారు. ఆ ప్రేమ, అభిమానం తనకు కూడా తెలంగాణ
ప్రజలకు నుంచి లభిస్తుందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మోదీ రాయలేదని, రద్దు చేస్తే ఊరుకునేది లేదన్నారు.

## 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు

రాజ్యాంగమే పేదలకు ఎన్నో అవకాశాలు కల్పించిందని 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది కూడా రాజ్యాంగం మాత్రమే అని ప్రియాంక గాంధీ అన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పవర్ లోకి రాగానే ఏటా మహిళలకు, నిరుద్యోగులకు లక్ష సాయం చేస్తామన్నారు. కనీస మద్ధతు ధరపై చట్టం చేస్తామన్నారు. చిన్న వ్యాపారులు, పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. బీజేపీ సృష్టించిన మత కల్లోలాలు, విద్వేషాలను అణిచి వేసి, ప్రేమ, అహింస కు మార్గం వేస్తామన్నారు. ప్రజలు అన్నదమ్ముల్లా ప్రశాంతంగా జీవించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేద ప్రజల కోసం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని, ఆయనకు అన్ని సమస్యల పట్ల అవగాహన ఉన్నదన్నారు.

## ఎస్సీ, ఎస్టీ,బీసీలు మద్ధతుగా ఉండాలి

రాహుల్ లక్ష్యం నెరవేరేందుకు ఎస్సీ, ఎస్టీ,బీసీలు మద్ధతుగా ఉండాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు. ఇక గడిచిన పదేళ్లలో బీజేపీ చేసింది ఏమీ లేదన్నారు. పేద రైతులకు రూ.50 వేలు, రూ.లక్ష రుణాలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద రైతులకు రుణమాఫీ చేసేందుకు బీజేపీ సర్కార్ అంగీకరించదన్నారు. అంబానీ, అదానీల లాంటి బడా వ్యాపారులకు మాత్రం బీజేపీ సర్కార్ ఏకంగా రూ.16లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని ఆరోపించారు. పైగా కాంగ్రెస్ ప్రారంభించిన ప్రాజెక్టులు, పథకాలపై మోదీ తన ఫొటోలు వేసుకున్నారని మండిపడ్డారన్నారు. ఇప్పుడు థర్డ్ టైమ్ గెలిస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా తొలగిస్తారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేదలను ఆదుకునే పథకాలేమీ లేవని విమర్శించారు. దేశ ప్రజలు చెప్పే సమస్యలు వినటానికి కాంగ్రెస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కాంగ్రెస్ నేతలు భావిస్తారని అన్నారు.

## పేదల కోసం బీజేపీ ఏమీ చేయదు

ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 ఉన్నదని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో రూ.500కే ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు, నిరుపేదలు, మహిళల కోసం బీజేపీ ప్రభుత్వం ఏమీ చేయదని మండిపడ్డారు. బీజేపీ పాలనలో పేదలపై వేసే పన్నులు నిరంతరం పెరుగుతూనే ఉంటాయన్నారు. కాంగ్రెస్‌పై బీజేపీ నేతలు ఎన్నో అబద్ధాలు ప్రచారం చేస్తుందన్నారు. కాంగ్రెస్ కొందరి ఆస్తులు గుంజుకుని మరో వర్గానికి ఇస్తుందని బీజేపీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. ధర్మం పేరిట అన్నదమ్ముల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారన్నారు. ధర్మం పేరిట ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు.

# 2 లక్షల రుణమాఫీ రుణం తీర్చుకుంటా

- కాంగ్రెస్ చేపట్టిన ప్రాణహిత చేవెళ్లను కేసీఆర్ రద్దు చేశారు
- తెలంగాణ అభివృద్ధి కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ఉండాలి
- బీజేపీది విభజించు, పాలించు సిద్ధాంతం
- అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ కు ఓటు వేయాలి
- పటాన్ చెరు ప్రాంతానికి గోదావరి జలాలు
- పటాన్ చెరు మినీ ఇండియా లాంటిది
- రాజ్యాంగం మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోంది
- ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పంద్రాగస్ట్ నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి వారి రుణం తీర్చుకుంటానని ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో కలిసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. తాండూరుకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అందుకే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును రద్దు చేశారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా కావాలని అడిగితే కేంద్రం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రూ.7500 కోట్ల నిధులు విడుదల

తెలంగాణ అభివృద్ధి కావాలంటే కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. మే 9వ తేదీ నాటికి రైతు భరోసా కింద రూ.7500 కోట్ల నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. మాట ప్రకారం రెండ్రోజుల ముందే మే 6వ తేదీ నాటికి రైతు భరోసా నిధులు విడుదల చేశామన్నారు. తెలంగాణ లోక్ సభ ఎన్నికల ప్రచారం చివరిరోజు సీఎం రేవంత్ రెడ్డి పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. మొదట మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా రోడ్ షోలో పాల్గొన్నారు. అనంతరం వికారాబాద్ జిల్లా తాండూరులో ప్రియాంక గాంధీతో పాటు భారీ బహిరంగ సభలో పాల్గొని చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని గెలిపించి పార్లమెంట్ కు పంపించాలని కోరారు.

## బీజేపీవి మత రాజకీయాలు

పటాన్ చెరులో నిర్వహించిన కార్నర్ షోలో రేవంత్ రెడ్డి బీజేపీపై మండిపడ్డారు. బీజేపీది విభజించు, పాలించు సిద్ధాంతం అని, అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ కు ఓటు వేయాలని కోరారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రాజేసి రాజకీయాలు చేసి, బీజేపీ సీట్లు నెగ్గే ప్రయత్నం చేస్తుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పటాన్ చెరు మినీ ఇండియా లాంటిదని, ఎన్నో రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి నివసిస్తున్నారని చెప్పారు. పటాన్ చెరు ప్రాంతానికి గోదావరి జలాలు రావాలన్నా, మెట్రో రైలు రావాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ అగ్రనేతలు చెబుతున్నారని, రాజ్యాంగాన్ని సైతం మార్చే యోచనలో బీజేపీ ఉందని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, ఉపాధి అవకాశాలు పెరగాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రానికి వచ్చినా కొత్త ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకపోగా, ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం మాత్రం చేశారని విమర్శించారు.

## ఇండియా కూటమిని గెలిపించండి

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడానికి ఇండియా కూటమిని గెలిపించండి.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. లోక్ సభ ఎన్నికల వేళ తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో సందేశం విడుదల చేశారు. ఇవి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి జరుగుతున్న ఎన్నికలు.. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న ఎన్నికలు.. అని.. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడానికి ఇండియా కూటమిని గెలిపించాలంటూ.. రేవంత్ రెడ్డి కోరారు. అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని రాశారని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అంబేద్కర్ రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ఎదిగారంటూ పేర్కొన్నారు. రాజ్యాంగం మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల రహిత దేశంగా మార్చాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాల్సిన భారత్ బీజేపీ కుట్రలకు బలి అవుతోందని.. ప్రజలు గమనించి ఓటు వేయాలని కోరారు.

# కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించబోతోంది

**మొదటిపేజీ తరువాయి**

స్థానాలు గెలవబోతోందన్నారు. రెండు జాతీయ పార్టీలను మించి అద్భుత విజయం సాధించబోతోందని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో చాలా తప్పులు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వాలు మారితే.. గత ప్రభుత్వం కంటే బాగా పనిచెయ్యాలి.. కానీ.. అనేక ముఖ్య విషయాలు పక్కన పెట్టి చిల్లర రాజకీయాలు చేశారంటూ కేసీఆర్ ఫైర్ అయ్యారు.

## విలువైన సమయం వృధా

అసెంబ్లీ వేదికగా శ్వేతపత్రాలంటూ ప్రతిపక్షాలను తూలనాడారు.. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై అతి తక్కువ సమయం కేటాయించారంటూ పేర్కొన్నారు. ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారు.. అది కాంగ్రెస్‌ను ముంచెయ్యబోతోంది.. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న జోష్.. కాంగ్రెస్‌లో ఇప్పుడు లేదని.. అంటూ కేసీఆర్ అన్నారు. రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ తక్కువ దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఏయే రంగాల్లో ఏం చేయబోతున్నారో చెప్పలేదు. అమూల్య సమయాన్ని చిల్లర రాజకీయాల కోసం వెచ్చిస్తున్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రాలు విడుదల చేసి, ప్రతిపక్షంపై విమర్శలు చేశారు. రాష్ట్ర పురోగతి గురించి అసలు మాట్లాడలేదు. ఆ వైఫల్యానికి కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించబోతోందన్నారు.

## ప్రజలు ఆగ్రహంతో ఉన్నరు

ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. అది ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా కనిపిస్తుంది. రాజకీయ అనుభవంతోనే ఇది చెబుతున్నా. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ వస్తే, సరూర్‌నగర్ స్టేడియంలో అభాసుపాలయ్యారు. మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి జరిగిన సభకు కనీసం మూడు వేల మంది కూడా రాలేదు. సీఎం సభల్లోనూ ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న చొరవ ఇప్పుడు కనిపించలేదు. రాష్ట్రం దివాలా తీసిందనే వ్యాఖ్యలు ఏ ముఖ్యమంత్రి చేయరు. అది రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను దెబ్బతీస్తుందన్నారు.

## తెలంగాణ వ్యతిరేకి.. అయినా కొనసాగించాం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు చక్కగా నడిచే అనేక వ్యవస్థలను పట్టించుకోవడం లేదు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పరిధిలోకి అదనంగా ఇంకొన్ని జబ్బులు చేర్చి, మేము అలాగే కొనసాగించాం. అందుకు కావాల్సిన నిధులనూ విడుదల చేశాం. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో అవకతవకలు ఉన్నాయని తెలిసినా, ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని కొనసాగించామని తెలిపారు.
రాజశేఖర్‌రెడ్డి తెలంగాణ వ్యతిరేకి అయినా, ఆయన ప్రారంభించిన పథకాలు మంచివి. అందుకే మేమూ వాటిని కొనసాగించాం. ఎప్పుడూ వాటిని రద్దు చేస్తామని చెప్పలేదు. అవి చక్కటి ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తన కాళ్లను తానే విరగొట్టుకుంది. తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో కరెంట్ కష్టాలు వర్ణనాతీతం. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నెలల్లోనే 24గంటల కరెంట్ సరఫరా చేశాం. దేశంలో మరే రాష్ట్రమూ ఇలా చేయలేదు. కేసీఆర్ పక్కకు వెళ్లగానే స్విచ్ ఆఫ్ చేసినట్లు కరెంట్ పోయిందని మండిపడ్డారు.

## హైదరాబాద్ ఇమేజ్ డ్యామేజ్

ఇటీవల హైదరాబాద్‌లో వర్షం పడితే చాలా చోట్ల పది గంటలపైనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. లండన్, న్యూయార్క్‌ల్లో కరెంట్ పోయినా హైదరాబాద్‌లో పోదు' అన్న పరిస్థితి తీసుకొచ్చా. కానీ, ఇప్పుడు ఆ ఇమేజ్‌ను కాంగ్రెస్ పార్టీ డ్యామేజ్ చేస్తోంది. చాలా పంటలు ఎండిపోయాయి. మోటార్లు కాలిపోయాయి. పలువురు రైతులు కూడా చనిపోయారు. కాంగ్రెస్ పార్టీ అతి ప్రవర్తనే ఇందుకు కారణం అని నిందలు మోపారు.

## పరిశ్రమలు తరలిపోతున్నయ్

ఇప్పుడు చాలా పరిశ్రమలు తెలంగాణ నుంచి తరలిపోతున్నాయి. మిషన్ భగీరథ పనులు ఒక ఛాలెంజ్‌గా తీసుకుని చేశాం. నిరుపేద, గ్రామీణ ప్రజలకు రూపాయి కూడా తీసుకోకుండా కుళాయి కనెక్షన్ ఇచ్చాం. ఇప్పుడు బిందెలతో నీళ్లు పట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ ఐదు నెలల్లో రెండున్నర లక్షల ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసినట్లు నాకు సమాచారం ఉంది. బాగా నడిచిన వ్యవస్థలను కాంగ్రెస్ పార్టీ భ్రష్టు పట్టిస్తోందన్నారు.

## హైదరాబాద్‌ను కాపాడుకుంటాం..

హైదరాబాద్ రెండో రాజధాని అయితే బాగుంటుందని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే లాంటి వ్యక్తి మాట్లాడం అంటే.. అంతకంటే దురదృష్టం ఇంకోటి ఉండదు. ఇన్ని రోజులు ఢిల్లీకి పోయిన ఆయన.. నాకు హైదరాబాద్ దగ్గరైతదని చెప్పి హైదరాబాద్ గొంతు కోస్తమంటే తెలంగాణ ప్రజలు ఊరుకోరు. ఖర్గే లాంటి వ్యక్తి కూడా హైదరాబాద్ రెండో రాజధాని కావాలని అంటుండంటే వీళ్లు ఎవరు వచ్చినా హైదరాబాద్‌ను దెబ్బ కొడుతారు అని అర్థమైతుంది. హైదరాబాద్ మనది మన సొంతం. దాన్ని అట్ల పోనివ్వం. అటువంటి పిచ్చివాళ్లకు ఇక్కడ స్థానం ఇవ్వకూడదు అని కేసీఆర్ స్పష్టం చేశారు.

## వారంతా పవర్ ఫ్లవర్స్..

నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక చాలా దుర్మార్గాలు జరుగుతున్నాయి. ఈ సన్ ఫ్లవర్ గ్యాంగ్ ఎక్కువగా తయారైంది. పొద్దు తిరిగినట్టు తిరుగుతారు. ఇవన్నీ పవర్ ఫ్లవర్స్.. కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కాదు వాళ్ల స్వార్థం కోసం వాళ్ల పైరవీల కోసం వాళ్ల స్వలాభం కోసం పోతున్నారు. అందరు పోలేదు. బీఆర్ఎస్ ఒక మహాసముద్రం 60 లక్షల సభ్యత్వం ఉంది. బీఆర్ఎస్‌ను ఎలిమినేట్ చేస్తామంటే అది అహంకారం. లక్షల రేవంత్ రెడ్డిలు వచ్చినా వెంట్రుక మందం ఫరాక్ పడదు అని కేసీఆర్ స్పష్టం చేశారు.



### నా జాతీయ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తా..

జాతీయ రాజకీయాల్లోకి రావాలని చెప్పి బీఆర్ఎస్ పార్టీ పేరు మార్చాం.. ఆ ప్రయత్నం చేశాం. మహారాష్ట్రలో కార్యక్రమాలు చేపట్టాం. అక్కడ్నుంచి వచ్చిన కొంత మంది నాయకులు.. అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. మీ పేరు చెప్పుకుని మేం గెలుస్తాం. మా దగ్గర మార్పు రావాలి. మీ ప్రభుత్వంలో అమలైన పథకాలు రావాలని ప్రజలు కోరుతున్నారు. మిమ్మల్ని తీసుకురావాలని కోరుతున్నారు. మా దగ్గర భయంకరమైన అనిశ్చితి ఉందన్నారు. నా జాతీయ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తాను. అనుమానం లేదు. ఎన్నికల తర్వాత అందరితో చర్చించి ప్రాంతీయ శక్తుల ఐక్యతకు కృషి చేస్తాను. నా తెలివితేటలను రంగరించి అన్ని ప్రయత్నాలు చేస్తాను. ఇప్పటికే చాలా మందితో మాట్లాడుతున్నాను. అందరం కలిసి ప్రత్యామ్నాయం రూపొందిస్తాం అని కేసీఆర్ తెలిపారు.

### పట్టించుకునే నాథుడు లేడు

కాంగ్రెస్ గెలిచిన తర్వాత అధికార యంత్రాంగానికి స్వేచ్ఛ లభించింది. విచ్చలవిడితనం వచ్చింది. శాఖల వారీగా సమీక్షలు లేవు. దీంతో ఏ సమస్య వచ్చినా పట్టించుకునే నాథుడు లేడు. ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగడం లేదు. చెప్పినమాట ప్రకారం రుణమాఫీ చేయలేదు. ఇప్పుడు ఆగస్టు 15వ తేదీ అంటున్నారు. అది ఏ ఆగస్టు 15వ తేదీనో చెప్పడంలేదు. ఈ ప్రభుత్వం రావడం శాపమని రైతులు భావిస్తున్నారు. రైతుబంధు ఇచ్చే పరిస్థితి లేదు. ఎందుకంటే ఇచ్చిన హామీ ప్రకారం సంవత్సరానికి రూ.20వేల కోట్లు అవుతుంది. అది ఇవ్వలేమని తెలిసిపోయిందని అందకే కాంగ్రెస్ సర్కారు నాటకాలు ఆదుతుందని మండిపడ్డారు.

# ఎన్నికలకు సర్వం సిద్ధం

- రాష్ట్రంలో 144 సెక్షన్ అమల్లోకి
- బల్క్ ఎసెమ్మెఎస్ పై నిషేధం..
- ప్రకటనలు ఇవ్వాలంటే ఈసీ అనుమతి తప్పనిసరి: సీఈవో వికాస్ రాజ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చిందని చెప్పారు. దాంతో కారణంగా నలుగురి కంటే ఎక్కువ మంది కలిసి ఉండొద్దన్నారు. 3.32కోట్ల మంది ఓటుహక్కు ఓటు వేసేలా 35,808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం పూర్తికావడంతో తదుపరి ఏర్పాట్లపై దృష్టి పెట్టామన్నారు. ఆదివారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు బయలుదేరి వెళ్తాయన్నారు. 13న ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభమవుతుందని.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మినహా మిగతా ప్రాంతాల్లో 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని మూడు పోలింగ్ కేంద్రాల్లో 10,12,14 మంది ఓటర్లు ఉండగా, 13 పోలింగ్ కేంద్రాల్లో 25 మందిలోపు ఓటర్లు, 23 పోలింగ్ కేంద్రాల్లో 50లోపు ఓటర్లు ఉన్నారన్నారు. 9,900 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామని.. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 12వేలమంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని.. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ చేస్తున్నట్లు వివరించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ పూర్తవుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి రూ.320కోట్ల నగదు, ఉచితాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీలకు సంబంధించి 8వేలకుపైగా కేసులు నమోదు



చేసినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి, ఎన్నికల సంబంధించి బల్క్ ఎస్ఎంఎస్‌లను ప్రదర్శించడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. సీ విజిల్, టోల్‌ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకున్నామని వివరించారు. 1.90లక్షల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటారని.. 161 కంపెనీల కేంద్ర సాయుధ దళాలు, పారా మిలిటరీ బలగాలతో మొత్తం 70వేల మంది సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించినట్లు తెలిపారు. అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు బ్యాలెట్ యూనిట్లలో ప్రదర్శించబడే అభ్యర్థుల క్రమాన్ని తనిఖీ చేయాలని, సరైన వారిని ఎంపిక చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ స్టేషన్ వివరాలను తెలుసుకునేందుకు 1950లో ఎస్ఎంఎస్ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో అన్నికి మౌలిక వసతులను అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటి వరకు 20వేల మంది ఓటర్లు హోం ఓటింగ్ వేశారన్నారు. 1.88లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని చెప్పారు. ప్రచార సమయం ముగిసిన తర్వాత నియోజకవర్గాల్లో ఇతరులు ఉండకూడదన్నారు. రేపు, ఎల్లుండి దినపత్రికల్లో ప్రకటలు ఇవ్వాలంటే అనుమతి తీసుకోవాలన్నారు. మే 13న అన్ని కంపెనీలు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, లేకపోతే ఆయా సంస్థలపై చర్యలుంటాయని హెచ్చరించారు.

# కాంగ్రెస్ 50 సీట్లు కూడా గెలవదు

**మొదటిపేజీ తరువాయి**

వైఖరి కారణంగా జమ్మూ కశ్మీర్ ప్రజలు ఆరు దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని భరించవలసి వచ్చిందని ఆరోపించారు.

## నవీన్ పట్నాయక్‌కు మోదీ సవాల్

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సవాల్ విసిరారు. ఒడిశాలోని అన్ని జిల్లాలు, హెడ్‌క్వాటర్ల పేర్లు చెప్పాలని అన్నారు. ఇంత కాలం ముఖ్యమంత్రిగా ఉన్న 'నవీన్ బాబు'కు సవాల్ చేస్తున్నా. కాగితంపై చూడకుండా ఒడిశా జిల్లాలు, వాటి రాజధానుల పేర్లు చెప్పమని నవీన్ బాబును అడగండి అని జనాన్ని ఉద్దేశించి అన్నారు. రాష్ట్రంలోని జిల్లాల పేర్లు సీఎం చెప్పలేకపోతే మీ బాధ ఆయనకు తెలుస్తుందా? అని మోదీ ప్రశ్నించారు. బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఐదేళ్లలో ఒడిశాను నంబర్ వన్‌గా చేయకపోతే తనను నిలదీయాలని అన్నారు. ఒడిశాలోని 21 లోక్‌సభ సీట్లు, 147 అసెంబ్లీ స్థానాలకు మే 13 నుంచి జూన్ 1 వరకు నాలుగు దశల్లో పోలింగ్ జరుగనున్నది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి.



# వేగంగా... హైరైజింగ్

## నగరంలో విస్తరిస్తున్న ఆల్ట్రా మోడ్రన్ ప్రాజెక్టులు
## శరవేగంతో భారీ హైరైజ్ ప్రాజెక్టుల నిర్మాణం

**విశాలభారతి, హైదరాబాద్ :**

చారిత్రక నగరానికి మరింత వన్నె తెచ్చేలా హైరైజ్ ప్రాజెక్టులు విస్తరిస్తూనే ఉన్నాయి. నగరం నలువైపులా భారీ అంతస్తుల్లో ఉండే ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నాయి. ఒకప్పుడు ఈ తరహా ప్రాజెక్టులు కేవలం వెస్ట్ సిటీకి పరిమితమైయ్యాయి. కానీ మారుతున్న కొనుగోలుదారుల అభిరుచి, హైరైజ్ ప్రాజెక్టుల నిర్మాణానికి క్రమంగా ఆదరణ పెరిగింది. దీంతో హైదరాబాద్ నిర్మాణరంగం నిత్యం కొంగొత్త రీతిలో రూపాంతరం చెందుతూనే ఉంది. దీంతో ఆకాశమే హద్దుగా హైరైజ్ ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పుంజుకున్నది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలే విలాసవంతమైన భవనాలకు ధీటుగా నగరానికి నలువైపులా ఉన్న ప్రధాన కేంద్రాలైన ఉప్పల్, ఎల్బీనగర్, సుచిత్ర వంటి ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని హైరైజ్ ప్రాజెక్టులు చేపట్టగా... ప్రస్తుతం మెజార్టీ ప్రాంతాల్లో నిర్మాణం వేగంగా సాగుతున్నది. అలా రియల్ ఎస్టేట్ లో శరవేగంగా విస్తరిస్తున్న హైరైజ్ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి ఈ వారం విశాలభారతి రియల్ టాక్‌లో....

2010 వరకు హైరైజ్ భవనాలకు ఆశించిన ఆదరణ లేదు. కానీ ఢిల్లీ, ముంబై, బెంగుళూరు వంటి కాస్మో పాలిటన్ సిటీ లలో ఈ తరహా ప్రాజెక్టులకు వచ్చిన ఆదరణ, విదేశాల్లో వీటికి ఉండే డిమాండ్ క్రమంగా హైదరాబాద్ నగరానికి విస్తరించింది. దేశంలోని అన్ని ప్రధాన మెట్రో నగరాలకు గట్టి పోటీనిస్తూ రియల్ ఎస్టేట్ రంగంలో లీడర్‌గా నిలుస్తున్న హైదరాబాద్ నగరంలో గడిచిన ఐదారేళ్లుగా భారీ మొత్తంలో స్కై స్క్రాపర్లు అందుబాటులోకి వచ్చాయి. ఒకేచోట వందలాది కుటుంబాలు నివాసం ఉండేలా నిర్మిస్తున్న రెసిడెన్షియల్ కాంప్లెక్సులు గ్లోబల్ సిటీలో సరికొత్త నగరాలను తలపిస్తున్నాయి. దశాబ్ధ కాలంగా హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ ప్రాంతంలోనే కొలువుదీరినా... హైరైజ్ భవనాలకు ఇటీవల కాలంలోనే అత్యంత ఆదరణ, డిమాండ్ పెరిగింది. అవీ కూడా కేవలం వెస్ట్ సిటీ కేంద్రంగా చేసుకుని పదుల అంతస్తుల్లో ఉండే భవనాలను నిర్మాణ సంస్థలు నిర్మించేంది. దీంతో హైరైజ్ ప్రాజెక్టులంటే కేవలం వెస్ట్ సిటీయే అన్నట్లుగా మారడంతో.. క్రమంగా కొనుగోలుదారులు పెరగడంతో నగరం నలువైపులా హైరైజ్ ప్రాజెక్టులు విస్తరించాల్సిన అవకాశం ఏర్పడింది. దీంతోపాటు మెరుగైన రవాణా సదుపాయాలు, ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉండే ప్రాంతాలు, ఐటీ, ఐటీ అనుబంధ, ఐటీయేతర సంస్థల విస్తరించడంతో నగరం నలువైపులా ఈ తరహా ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తూనే ఉన్నాయి. ప్రధానంగా ఉన్న ఈస్ట్ సిటీలోని ఉప్పల్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఆకాశహార్మ్యాలను నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్నాయి.

## వేగంగా నిర్మాణ పనులు..

విజయవాడ హైవేకు సమీపంలో ఉండే దిల్‌సుఖ్ నగర్, ఎల్బీ నగర్, హయత్ నగర్‌తో పాటు వరంగల్ హైవే వెంబడి ఉన్న ఉప్పల్, నాగోల్ వంటి ప్రాంతాలు హైరైజ్ ప్రాజెక్టులను ప్రముఖ నిర్మాణ సంస్థ వాసవి గ్రూప్ నిర్మిస్తోంది. ఈ ప్రాంతాల్లో ఉన్న నివాస సముదాయాలన్నీ కూడా స్టాండ్ ఏలోన్ లేదా ఇండిపెండెంట్ ఇండ్లు ఎక్కువగా కనిపిస్తాయి. కానీ సకల సదుపాయాలతో లగ్జరీ అనుభూతినిచ్చే హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులను తొలిసారిగా వాసవి గ్రూప్ చేపట్టింది. వెస్ట్ సిటీలో మాత్రమే కనిపించే హైరైజ్ ప్రాజెక్టును సాధారణ, ఎగువ మధ్య తరగతి వర్గాలకు అనుకూలంగా ప్రాజెక్టులను వాసవి గ్రూప్ చేపట్టింది. అందుబాటు ధరలతోపాటు లగ్జరీ సదుపాయాలు ఉండే హై ఎండ్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. ఎల్బీనగర్ సరూర్ నగర్ స్టేడియాన్ని ఆనుకుని నిర్మిస్తున్న ఆనంద నిలయం మొదటి. ఎల్బీనగర్ కేంద్రంగా హైదరాబాద్ ఈస్ట్ సిటీలో 33 అంతస్తుల్లో 11 హైరైజ్ భవనాలతో చేపట్టిన వాసవి ఆనంద నిలయం ప్రాజెక్టు ఈస్ట్ సిటీకి తలమానికంగా మారనుంది. ఈ ప్రాంతంలో తొలి హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు కూడా ఇదే కాగా 3576 ఫ్లాట్లలో స్కై విల్లాలను నిర్మిస్తున్నారు. పనులు శరవేగంగా సాగుతుండగా... 30 ఎకరాల విస్తీర్ణంలో 70శాతానికి పైగా ఓపెన్ స్పేస్‌తో ఈ ప్రాజెక్టు రానుంది. ఇప్పటికే ఉప్పల్ జంక్షన్, హబ్సిగూడ ప్రాంతాలు ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు విస్తరించి ఉండటంతో... ఉప్పల్ ప్రధాన కేంద్రంగా వాసవి క్రౌన్ ఈస్ట్ హైరైజ్ ప్రాజెక్టును చేపట్టింది. 1.92 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక జీవనశైలిని కోరుకునే వారికి వీలుగా ఉండేలా 324 ఫ్లాట్లతో ఈ ప్రాజెక్టు కూడా అందుబాటులోకి వస్తోంది. ఇక బాచుపల్లి కేంద్రంగా వాసవి అర్బన్ ప్రాజెక్టు ఫ్లోరింగ్ దశను పూర్తి చేసుకున్నది. నార్త్ సిటీలో మరో ఐటీ కేంద్రంగా విస్తరిస్తున్న కుత్బుల్లాపూర్‌కు సమీపంలో, ఓఆర్ఆర్‌కు చేరువలో ఉండేలా వాసవి భువి ప్రాజెక్టును ఇటీవల ఆవిష్కరించి శరవేగంతో ఫౌండేషన్ పనులను చేపట్టింది. అదేవిధంగా ఫిర్జాదిగూడలో హరిహర శ్రీసాయి వీరాధ్య బ్రాండ్ నేమ్‌తో 10ఫోర్లలో, 214 యూనిట్ల ప్రాజెక్టును నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు త్వరలో వినియోగదారులకు అందజేయనున్నారు. పోచారం క్రాస్ రోడ్డులో వరంగల్ హైవేకు ఆనుకుని హరిహర శ్రీసాయి కాకతీయ పేరుతో మరో హైరైజ్ ప్రాజెక్టును 360యూనిట్లతో 15 ఫ్లోర్లతో, మరో రెండేళ్లలో అందుబాటులోకి రానుంది. ఇక సిటీలోనూ హైరైజ్ ట్రెండ్ విపరీతంగా పెరగడంతో... 40 ఫ్లోర్లతో తొలి స్కై స్క్రాపర్ ప్రాజెక్టు టీఎన్ఆర్ గ్రూప్ నిర్మిస్తున్నది. ఎల్బీ నగర్ కేంద్రంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. పూర్తి స్థాయిలో హైరైజ్ ప్రీమియం ఫ్లాట్లతో ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకు వస్తోంది. ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణంలో నాణ్యత, ఆధునిక జీవన విధానానికి అనుకూలమైన వసతులతో టెర్రాస్ బేస్డ్ అమెనిటీస్‌తో 10 ఫ్లోర్లతో 100 ప్రీమియం ఫ్లాట్ల మోడ్రన్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును టీఎన్ఆర్ పూల్‌దీప్ ప్రాజెక్టును ఈ గ్రూప్ చేపట్టింది. ఇక ఉప్పల్ కేంద్రంగా ఐటీ, ఐటీ ఆధారిత సేవలు విస్తరిస్తున్నాయని చెప్పడానికి నిదర్శనమే జెన్ పాక్ట్ ప్రాంగణంలో రానున్న హైరైజ్ ఆఫీస్ స్పేస్. తొలిసారిగా ఈస్ట్ సిటీలో రాంకీ నిర్మాణ సంస్థ నుంచి ఈ ప్రాజెక్టును చేపట్టింది. 15 అంతస్తుల్లో1.9 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ హైరైజ్ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉండగా మరో రెండేళ్లలో 15వేల మంది ఒకచోట పనిచేసేంత వర్కింగ్ స్పేస్ అందుబాటులోకి రానుంది.



### నగరం నలువైపులా...

గతంలో కోర్ సిటీ నుంచి వెస్ట్ జోన్ పరిధిలోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, నానక్ రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, రాయదుర్గం, కోకాపేట్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మెరుగైన రవాణా సదుపాయాలు ఉండేవి కావు. కానీ మెట్రో, అందుబాటులోకి వచ్చిన ఆధునిక రవాణా సదుపాయాలతో సుదూరాలను కూడా సులభంగా చేరుకునే అవకాశం ఏర్పడింది. అలా నగరం ఏ మూల నుంచైనా అన్ని ప్రాంతాలకు చేరుకునే వీలు ఉంది. అదేవిధంగా ఇంటర్నేషనల్ స్కూళ్లు, మెరుగైన వైద్య సదుపాయాలు, రిక్రియేషనల్ సెంటర్లు నగరానికి నలువైపులా నిర్మిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ సమీపంలోనే ఉండాలనే భావన కూడా జనాల్లో తగ్గిపోవడంతో సిటీకి దూరంగా ఉన్న ప్రాంతాలకు ఆదరణ పెరుగుతున్నది. ఆర్థిక స్థితిగతులను బట్టి విలాసవంతమైన జీవనం కోసం ఓఆర్ఆర్ దాటి నగర పరిధి విస్తరిస్తోంది. దీంతోపాటు కొన్ని ప్రాంతాల్లో విపరీతంగా పెరిగిన భూముల ధరలు కూడా నగరం నలువైపులా ఈ తరహా ప్రాజెక్టులు విస్తరించడంలో ప్రధాన కారణమైంది.

### అందుబాటులో హైరైజ్ ప్రాజెక్టులు

హైరైజ్ భవనాలంటే కేవలం సంపన్న వర్గాలకు మాత్రమేననే భావన తొలగిపోయింది. ఇటీవల పెరిగిన ఆర్థిక ప్రమాణాలతో మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలకు చెందిన జనాలు కూడా కొనుగోలు చేస్తున్నాయి. ప్రస్తుతం కోర్ సిటీలో గానీ, విల్లా ప్రాజెక్టులలో గానీ ఇండిపెండెంట్ నిర్మాణం అనేది ఖర్చుతో కూడిన వ్యవహారమే. ఈ క్రమంలో సామాన్యుడు కొనుగోలు ఆలోచనలు అన్నీ కూడా స్టాండ్ ఏలోన్, హైరైజ్ ప్రాజెక్టులకే ఉందంటున్నారు. వెస్ట్ సిటీతో పోల్చితే ఈస్ట్ ప్రాంతంలో పుష్కళమైన ల్యాండ్ బ్యాంక్, ధరల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో... అక్కడి కంటే తక్కువలోనే హైరైజ్ ప్రాజెక్టులను నిర్మించే అవకాశం బిల్డర్లకు దక్కింది. ఇవే అంశాలు అటు డెవలపర్లను, ఇటు కస్టమర్లను హైరైజ్ నిర్మాణాలు నగరంలో పెరిగేందుకు కారణం అవుతున్నాయి. ఉప్పల్ నుంచి ఎల్బీ నగర్ వరకు సుమారు ఐదారు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తున్నాయి.







# అభివృద్ధి అజెండానే బీఆర్ఎస్ విజయరహస్యం

- రక్తి కట్టించిన ప్రచారంతో మెదక్‌లో బీఆర్ఎస్ ప్రచారం
- మాజీ ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కేసీఆర్ ఫోకస్
- బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రచారం చేసిన పార్టీ శ్రేణులు

**విశాలభారతి, మెదక్ :**
పదేళ్ల తెలంగాణ అభివృద్ధి ఓవైపు, అలవు కానీ హామీలతో అధికార పార్టీ ఆశలతో మెదక్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రచారం రక్తి కట్టింది. ప్రచారపర్వం ముగియడంతో ఇక రేపు జరగబోయే ఓటింగ్‌పై అన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సొంత ఉమ్మడి జిల్లా కావడం, కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని సవాలుగా తీసుకోవడంతో మెదక్ పార్లమెంట్‌లో ఎన్నికల ప్రచారం ఇన్నాళ్లు రసవత్తరంగా సాగింది. పదేళ్లు చేసిన అభివృద్ధియే తమ పాలనకు సాక్ష్యమంటూ బీఆర్ఎస్ ప్రచారం చేయగా.. కళ్లబొల్లి హామీలతో మరోసారి జనాలకు చేరువయ్యేందుకు కాంగ్రెస్ చేసిన విశ్వప్రయత్నాలకు ధీటుగా మోదీ ఛరిస్మాయే తనను గెలిపిస్తుందంటూ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేసిన ప్రచారానికి శనివారం తెరపడింది. మొత్తం మూడు ప్రధాన పార్టీలకు ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ సారి ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానం హాట్ సీటుగా మారింది.

ఎమ్మెల్సీగా గెలిచిన ఆనతి కాలంలోనే మెదక్ పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం మాజీ ఐఏఎస్ వెంకట్రామిరెడ్డికి దక్కింది. ఈ జిల్లాతో కేసీఆర్‌కు అనుబంధం, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా వ్యూహాత్మకంగా ఆయన్ను బరిలో దింపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి స్థానం కావడం, బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు స్థానాల్లో గెలిచి బలోపేతంగా ఉండటంతో ఈ స్థానంలో గెలిచేందుకు కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టింది. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా దుబ్బాక నుంచి పోటీచేసి ఓడిన రఘునందన్ రావు మెదక్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేయడంతో అన్ని పార్టీలు సవాలుగా తీసుకుని ప్రచారం నిర్వహించాయి.





### బీఆర్ఎస్‌కు అనుకూలంగా ప్రత్యుర్థుల వైఫల్యాలు..

నిజానికి ఈ స్థానాన్ని మూడు పార్టీలు సవాలుగా తీసుకోవడం మెదక్ పార్లమెంట్ స్థానంలో సాగిన ఎన్నికల పర్వం రక్తి కట్టింది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కావడం, అందునా ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లను బీఆర్ఎస్ గెలుచుకుని పూర్తి ఆత్మ విశ్వాసంతో పార్లమెంట్ స్థానాన్ని మరోసారి దక్కించుకునేలా ఆ పార్టీ వ్యవహరించింది. వరుసగా ఎమ్మెల్యేలతో ప్రచారాలు, హరీష్ రావు ఇక్కడే ఉండే ఎన్నికలను పర్యవేక్షించడంతోపాటు, సౌమ్యుడిగా, ప్రజలకు సేవలు అందించడంతో మంచి పేరున్న అధికారిగా వెంకట్రామిరెడ్డికి ఉన్న సొంత ఛరిస్మా బీఆర్ఎస్ పార్టీకి కలసి వస్తున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలు బీఆర్ఎస్‌కు సానుకూలంగా మారిపోయాయి. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై అతి తక్కువ సమయంలో పెరిగిన అసహనం ఒకటైతే... మోదీ ఫేస్ వాల్యూనే నమ్ముకుని ప్రచారం చేసిన రఘునందన్ రావు, ఒకసారి ఉప ఎన్నికల్లో గెలిచిన చేసిందేమి లేక, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఆయన ఓడిపోయారు. కానీ అదృష్టాన్ని మరోసారి పరీక్షించుకుందామన్నట్లుగా అతి కష్టం మీద ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని దక్కించుకుని రఘునందన్ రావుకు గెలుపు ఆశించిన సులభంగా వచ్చేలా లేదనేది స్థానికులు భావిస్తున్నారు. ఈ క్రమంలో అభివృద్ధి ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రావీణ్యం ఉన్న వెంకట్రామిరెడ్డి గెలుపు కేక్ వాక్ లాంటిదేనని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. ఇలాంటి అంచనాలతో బరిలో దిగిన బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ అండదండలు సంపూర్ణంగా ఉండటంతో... బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి, మెదక్ అంటేనే లక్ష మెజార్టీ నినాదంతో ఆ పార్టీ విస్తృత ప్రచారం చేసింది.

### బీఆర్ఎస్‌కు అవకాశం...

మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించడంతోపాటు, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతి ఎన్నికను ఆ పార్టీ అత్యంత కీలకంగా తీసుకుని అభ్యర్థుల ఎంపిక నుంచి మొదలుకుంటే ప్రచారం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో మాజీ సీఎం హరీష్ రావు ఈ స్థానంలో గెలుపు బాధ్యతను అప్పగించి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కోసం ప్రత్యేక ఎన్నికల ప్రణాళికను బీఆర్ఎస్ పార్టీ అమలు చేసింది. ఆరు గ్యారెంటీలతో జనాలను ఆకట్టుకున్న మూడు నెల్లోనూ ఆ హామీల్లోని డొల్లతనం బయటపడటం, ఇన్నాళ్లు రైతులకు ఎదురు కానీ కరెంటు, సాగు నీటి కష్టాలతో ఆరు నెలల వ్యవధిలోనే జనాల్లో తీవ్ర అసహనం పెరుగుతున్న క్రమంలో... ఈ స్థానంలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించింది. కానీ గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన నీలం మధు... పార్టీ మారి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నికల పోటీ చేస్తున్నాడు. ఇక్కడే కాంగ్రెస్ ఎంపిక తప్పిందనే భావన ఆ పార్టీ శ్రేణుల్లో మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓడిన కాటా శ్రీనివాస్ గౌడ్‌ను కాదని, మరో పార్టీ అభ్యర్థిని బరిలో దింపడమే బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారింది. ప్రస్తుతం అంతర్గత కుమ్ములాటలు, పూర్తి స్థాయిలో అమలు కానీ కాంగ్రెస్ హామీలతో ఆ పార్టీకి ఆ స్థానంలో ఎదురీదుతోంది.



# వైన్స్ బంద్

- ఈనెల 13 సాయంత్రం 6 గంటల వరకు
- అక్రమ మద్యం సరఫరాపై అధికారుల నిఘా
- అబ్కారీ శాఖ

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:** పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో 48 గంటలపాటు మద్యం అమ్మకాలను నిలిపివేశారు. ఇవాళ సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయనున్నట్లు అబ్కారీ శాఖ వెల్లడించింది. మద్యం దుకాణాలతో పాటు బార్లు, క్లబ్‌లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, మద్యం డిపోలు మూసివేసినట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. ఎల్లుండి సాయంత్రం 6 గంటలకు ఎక్కడైనా పోలింగ్ ముగియనట్లయితే అక్కడ మాత్రం పోలింగ్ ముగిసే వరకు మద్యం దుకాణాలు బంద్‌లో ఉంటాయని వివరించింది.రాష్ట్రంలో అక్రమ మద్యం సరఫరా, గుడుంబా, గంజాయి తదితర తయారీ, సరఫరా, అమ్మకాలపై అబ్కారీ శాఖ నిఘా పెట్టింది. రాష్ట్రంలోని 139 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 139 ప్రత్యేక బృందాలు, 20 ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందాలు, 34 జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందాలు, 4 రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం పెట్రోలింగ్ చేస్తాయని అబ్కారీ శాఖ అధికారులు వివరించారు



# ఆర్టీసీ ఉద్యోగులకు డ్రెస్ కోడ్

- ఇక నుంచి జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు వద్దు
- సంస్థ ఎండీ సజ్జనార్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో;**
టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు డ్రెస్ కోడ్ అమలు చేయనున్నారు. ఈ మేరకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఆర్టీసీ అధికారులు, ఇతర సిబ్బంది ఇక నుంచి జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు ధరించి విధులకు హాజరు కావొద్దంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. టీఎస్ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు కాకుండా మిగతా వాళ్లు అంత క్యాజువల్ డ్రెస్సులు వేసుకొని వస్తున్నారు. అయితే ఆ తరహా వస్త్రధారణ సంస్థ గౌరవానికి భంగం కలిగించేలా ఉందంటూ సంస్థ ఎండీ సజ్జనార్ అభిప్రాయపడ్డారు. అందుకని ఇక నుండి ఆర్టీసీ ఉద్యోగులు అందరు ఫార్మల్ డ్రెస్సులోనే ఉద్యోగాలకు రావాలని ఆదేశాలు జారీ చేశారు

# దేశంలో గణనీయంగా తగ్గిన హిందూ జనాభా

### పెరిగిన బౌద్ధ, సిక్కు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు



**విశాలభారతి**
భారతదేశంలో హిందూ జనాభా గణనీయంగా తగ్గినట్లు ప్రధానికి చెందిన ఎకనామిక్ అడ్వైజరీ కౌన్సిల్ తన రిపోర్టులో పేర్కొన్నది. 1950 నుంచి 2015 వరకు హిందువుల జనాభా 7.81 శాతం పడిపోయినట్లు ఆ స్టడీలో తేల్చారు. భారత్‌లో హిందువుల జనాభా తగ్గుతూ ఉండగా, మరోవైపు బౌద్ధ, సిక్కు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల జనాభా పెరుగుతూ పోయింది. ఇక పార్సీలు, జైనులు జనాభా కూడా తగ్గింది. సమీప మిత్ర దేశాల్లో మెజారిటీ మతస్తుల సంఖ్య పెరుగుతుండగా, భారత్‌లో మాత్రం ఆ జనాభా తగ్గినట్లు రిపోర్టులో తెలిపారు.

1950 సంవత్సరంలో భారత్‌లో హిందువుల జనాభా 84.68 శాతం ఉండగా, 2015 నాటికి ఆ సంఖ్య 78.06 శాతానికి చేరుకున్నట్లు రిపోర్టులో వెల్లడించారు. మరో వైపు గడిచిన 65 ఏళ్ల కాలంలో ముస్లిం జనాభా మాత్రం 9.84 శాతం నుంచి 14.09 శాతానికి పెరిగిందని స్టడీలో పేర్కొన్నారు. మయన్మార్‌లో హిందువుల జనాభా పది శాతం పడిపోయింది. నేపాల్‌లో కూడా హిందువుల సంఖ్య 3.6 శాతం తగ్గినట్లు తెలిపారు. భారత్‌లో మైనార్టీలకు రక్షణ పెరిగిందని, వాళ్లు ఇండియాలో సుఖంగా జీవిస్తున్నట్లు స్టడీలో వెల్లడించారు. ప్రభుత్వ విధానాలు, రాజకీయ నిర్ణయాలు, సామాజిక విధానాల వల్లే మెజారిటీ జనాభా తగ్గి, మైనార్టీ జనాభా పెరిగినట్లు అంచనా వేశారు. అయితే సమాజంలో భిన్నత్వాన్ని ప్రోత్సహించే రీతిలో ఇండియా ఉన్నట్లు స్టడీలో రచయితలు అభిప్రాయపడ్డారు.

# థాయిలాండ్‌కు వెళ్లే భారతీయులకు నో వీసా

### మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ప్రకటన



**విశాలభారతి**
థాయిలాండ్ పర్యటనకు వెళ్లే భారతీయులకు అక్కడి ప్రభుత్వం మరో వెసులుబాటు కల్పించింది. పర్యాటక వీసా మినహాయింపు కార్యక్రమాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రత్యేకంగా వీసా అవసరం లేకుండానే థాయిలాండ్ అందాలను చుట్టి రావచ్చు. సాధారణ పాస్‌పోర్టు ఉన్నవారు అక్కడ గరిష్ఠంగా 30 రోజుల పాటు పర్యటించవచ్చు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు థాయిలాండ్ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా భారత్, తైవాన్ దేశాల నుంచి వచ్చేవారు వీసా అవసరం లేకుండానే తమ దేశంలో పర్యటించేందుకు నవంబరు 10, 2023 నుంచి అనుమతిచ్చింది. ఈ గడువు మే 10, 2024తో ముగుస్తోంది. ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలు ఇస్తుండడంతో ఈ వెసులుబాటును మరో ఆరు నెలలపాటు పెంచుతున్నట్లు రాయల్ థాయ్ క్యాబినెట్ నిర్ణయించింది. నవంబర్ 11, 2024 వరకు ఇది వర్తిస్తుంది. అంతకుముందు ఈ పథకం ద్వారా కేవలం 15 రోజులు మాత్రమే అక్కడ ఉండడానికి వీలుండేది.



## కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కొరకు ఇంటింటి ప్రచారం

**పాలకీడు, విశాలభారతి:** మండల కేంద్రంలోని బొత్తలపాలెం గ్రామంలో బి ఆర్ యస్ పార్టీ యం. పి కంచర్ల క్రిష్ణ రెడ్డి గెలుపు కోసం పాలకీడు మండల పార్టీ అధ్యక్షుడు క్రిష్టిపాటి అంజిరెడ్డి, మరియు తాటికొండ వెంకటరెడ్డి, బొత్తల పాలెం గ్రామ మాజీ సర్పంచ్ భోగాల వీరారెడ్డి,మాజీ ఉప సర్పంచ్ అందే వెంకటయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు రామినేని వెంకయ్య ఆధ్వర్యంలో నల్లగొండ పార్లమెంట్ బి ఆర్ యస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కొరకు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఇట్టి ప్రచార కార్యక్రమంలో కారు గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు ఇట్టి ప్రచార కార్యక్రమంలో రామినేని నరేష్ ,అందే వెంకన్న, అందె కనకయ్య ,వడ్డే వీరయ్య ,తీపి చెట్టి శ్రీను, చందా నారాయణ, అందే లక్ష్మీనారాయణ, సుందరి నరసింహారావు, అందే రవి, ఆర్లపూడి సైదులు ,సన్నిధి వెంకటేశ్వర్లు, మరియు గ్రామ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవం

- **మాతృమూర్తులకు బహుమతుల ప్రధానం, సన్మానం**

**పటాన్ చెరు,విశాలభారతి:**అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం, శ్రీ కొమ్మూరి చారిటబుల్ ట్రస్ట్ సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇస్నాపూర్ శ్రీ రామాలయం ఆవరణలో శుక్రవారం తీవ్ర వైకల్య దివ్యాంగులైన బిడ్డలకు సేవ చేస్తున్న 20 మంది మాతృమూర్తులను ఎంపిక చేసి వారికి రూ.1116 నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా శిశు సంక్షేమ, దివ్యాంగుల, వయవృద్ధుల జిల్లా సంక్షేమ అధికారిని లలితా కుమారి, పటాన్ చెరువు సిడిపిఓ చంద్రకళ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సల్మా సుల్తానా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని మాట్లాడుతూ టియండిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ కదల్లేని పరిస్థితుల్లో ఉండి ఇలాంటి చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వపరంగా వచ్చే స్వయం ఉపాధి రుణాలు, పరికరాలు, ప్రభుత్వం నుండి వచ్చే ఎలాంటి సహాయమైనా అందించడానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని హామీ ఇచ్చారు . రవికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించినందుకు సంక్షేమ అధికారి, దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సంతోషమ్మ, శిరీష, ఏపీఎం శ్రీనివాస్, సామాజిక కార్యకర్త బాపు వెంకన్న, యువ చైతన్య ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు కంచిగారి మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించండి

- **హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి**

**పాలకుర్తి, విశాలభారతి:** కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడియం కావ్య గెలుపు కోరుతూ ఝాన్సీ రెడ్డి రాయపర్తి మండల కేంద్రంలో పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచార జోష్ పెంచారు. రాయపర్తి మండల సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు, డాక్టర్ కావ్య గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరిని కాపాడుకుంటామని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద ప్రజల జీవితాలు బాగుపడుతాయని అన్నారు. 15 సంవత్సరాలు మోసపోయామని, మళ్ళీ మోసపోతే గోసపడుతామని అన్నారు, అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మండల పార్టీ ముఖ్యనాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి

- **ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, విశాలభారతి:**మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కూకట్పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో స్థానిక కార్పొరేటర్లు నిర్వహించిన చివరిరోజు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను 70 వేలకు పైగా మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం తో పాటు కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బి ఆర్ ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు..గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానని, అయితే ఎమ్మెల్యే నిధులతో పాటు ఎంపీ నిధులు కూడా తోడైతే సమస్యల పరిష్కారం చాలా సులభతరం అవుతుందని తెలిపారు..ఎంపీ నిధులు రావాలంటే ఎంపీ గా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓటర్లకు విజ్ఞాప్తి చేశారు.. ఈనెల 13న ఉదయం వేళలో అందరూ పోలింగ్ బూత్ కు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనీ కోరారు..కార్పొరేటర్ తో పాటు ఎమ్మెల్యే, ఎంపీ లు ఒకే పార్టీకి చెందినవారు ఐతే స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు...




## విద్యార్థులు ఆదర్శవంతమైన పౌరులుగా ఎదగాలి

- **ఘనంగా లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల వీడ్కోలు పార్టీ**
- **అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.**

**సికింద్రాబాద్ ,విశాలభారతి:** డా. ఎ.ఎస్.రావు నగర్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు డిగ్రీ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశ వేడుకలను యర్ర లలితా గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు డిగ్రీ జూనియర్, సీనియర్ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ కె.జ్యోతి సదానంద , వైస్ ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి , అధ్యాపకులు మరియు కళాశాల కార్యనిర్వాక సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.జ్యోతి సదానంద తుదిసంవత్సరం విద్యార్థులనుఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులంతా బాధ్యతాయుతంగా ఉన్నత ఆశయలతో ఆదర్శవంతమైన పౌరులుగా ఎదగాలని దేశ సేవలో తరించాలని కోరారు. వేడుకలలో జూనియర్ విద్యార్థులు సంప్రదాయ మరియు పాశ్చాత్య నృత్యరీతులతో , పలు ఆట పాటలతో సీనియర్ విద్యార్థులను ఎంతగానో అలరించాయి. విద్యాసంవత్సరములో ఉన్నతంగా రాణించిన సాయి స్వరూప్(బి.బి.ఎ) బి.యష్ కుమార్ (బి.కామ్) , కె. బబిత (బి.యస్.సి) , సీనియర్ విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమతులను ప్రదానం చేశారు.సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో నిర్వహించి ,ఆహ్లాదాన్ని అందించినన జూనియర్ విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మరియు కార్యనిర్వాహక సిబ్బంది పలువురు అభినందించారు.

## చేవెళ్ల పార్లమెంట్ లో బీఆర్ఎస్ జెండా ఎగరరేస్తాం

- **బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్ల తిరుమలేష్**



**శేరిలింగంపల్లి,విశాలభారతి:**చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయం ఖాయమని, లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తున్నారని శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు గర్ల తిరుమలేష్అన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదని, బీజేపీ పదేళ్ల కాలంలో చేవెళ్ల పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఒక బిసి బిడ్డగా రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ గా ఉన్నప్పుడు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి నేటికి సాక్షాత్కారమన్నారు.ఆ తర్వాత పదవి లేకపోయినా సమస్యల పరిష్కారంకోసం 30 ఏళ్లుగా బీసీ ఎస్సీ ఎస్టీలకొరకు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు నిస్వార్ధంగా సేవలను అందిస్తారని తెలిపారు.



## సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

- **కూకట్ పల్లి ఇంచార్జీ బండి రమేష్**

**కూకట్ పల్లి, విశాలభారతి:**మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న ఎన్నికల్లో తాము భారీ మెజారిటీతో గెలవబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి నేడు ప్రచారానికి చివరి రోజు కావడంతో నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ గా, వికారాబాద్ జెడ్పి చైర్పర్సన్ గా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. మల్కాజ్గిరి పార్లమెంటు నుండి ఎంపీ అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానని తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కాకుండా ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. తాము ఎక్కడ ప్రచారం నిర్వహించిన ప్రజలలో మంచి స్పందన కనిపిస్తోందన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడతాయని, ప్రజలే తమకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, శేరి సతీష్ రెడ్డి, దినేష్, గంధం రాజు, అధ్యక్షులు, మహిళా నాయకురాళ్ళు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యన్ని రక్షించాల్సిన బాధ్యత ఉంది

- **రాజ్యాంగాన్ని మార్చడమంటే విధ్వంసం చేయడమే**
- **ఓయూలో రాజ్యాంగ పరిరక్షణకై మేధావుల సదస్సు**
- **ప్రో.హరగోపాల్**



**సికింద్రాబాద్ ,విశాలభారతి:** ఒకే భావజాలం దేశంలో ఉండాలనుకోవడం తగదని ఇది భావప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని ప్రో.హరగోపాల్ అన్నారు. శనివారం ఓయూసిఎఫ్ ఆర్ట్స్ కార్యాలయంలో తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ,ఓయూ బహుజన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకై మేధావుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బీజేపీ వారు మెదటి నుండి రాజ్యాంగన్ని మాది కాదు అన్నట్లుగా వ్యహరించరన్నారు. 2024 ఎన్నికలు గత ఎన్నికల్ల కాకుండా రాజ్యాంగ విలువలపై దాడి జరుగుతుందన్నారు. సత్యం మాట్లాడితే అబద్ధం అంటు వారు ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. మనం కూడా తప్పుడు సమాచారన్ని నిజమా కాదా అని తెలుసుకోవాలని సూచించారు. అంబేద్కర్ సమానత్వం , బావప్రకటన స్వేచ్ఛ , సౌభ్రాతృత్వం లాంటి కీలకమైన ముఖ్య అంశాలను ప్రామాణికంగా తీసుకొని రాశారని చెప్పారు. ఈ మూడు అంశాలు ఎంతోమంది ప్రపంచ వ్యాప్తంగా త్యాగాల ద్వారా వచ్చాయి అన్నారు. రాజ్యాంగాన్ని మార్చడం అంటే దాని విలువలను విధ్వంసం చేయడమే అన్నారు. ప్రస్తుతం దేశాన్ని నిత్యం అసహనం , ద్వేషం తో ఉందని ఇది తగదని అన్నారు. మన దేశం సెక్యులర్ దేశం అంటు ప్రో.హరగోపాల్ గుర్తు చేశారు. 75 ఏళ్ళ ల్లో నిర్బంధ చట్టాలు కఠినమైన చట్టాలు ఎన్నో వచ్చాయి కానీ సమానత్వం లాంటి చట్టాలు రాలేదన్నారు. మనిషిని మనిషిగా ప్రేమించడం నేర్చుకోవాలన్నారు. ఇక సామాజన్ని ,ప్రజాస్వామ్యన్ని , సంరక్షణ చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే దృఢ రాజ్యాంగమైన భారత భూమిని నియంతృత్వ పోకడలతో బలిచేశారు.భగత్ సింగ్,నేతాజీ సుభాష్ చంద్ర బోస్, గాంధీ చేసిన త్యాగాలను అపహాస్యం చేశారు ఈ గాడ్సే భక్తులు వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఈ మీరు వేసే ఓటు విజ్ఞతకి, బాధ్యత కి రూపం కావాలి.రైతు ను నిజమైన రాజును చేయాలి. ఈ దేశ మహిళలను మాతృమూర్తులుగా గౌరవించే సంప్రదాయం చూపే దిశల ఉండాలి.ఆకలి చావులు లేని ప్రజాస్వామ్య పాలన కావాలి. చదివిన చదువుకి తగిన గౌరవంఇచ్చి దిక్కుచి కావలి.దళిత,గిరిజన,మైనారిటీ ల హక్కులు కాపాడే ఉన్నత శిఖరం కావాలి. ముఖ్యంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రతృత్వం కాపాడేనాయకులకు మన ఓటు వేసి గెలిపించాలన్నారు.



## తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

- **శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ,కార్యక్రమలకు ఆకర్షితులై బిఆర్ఎస్,బిజెపి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు.అల్విన్ కాలనీ డివిజన్ జై శంకర్ కాలనీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు పవన్,శ్రీను కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు నల్ల సంజీవ రెడ్డి,బి.కృష్ణ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారిని జగదీశ్వర్ గౌడ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని,తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.సంక్షేమ ఫలాలు పేదలకు అందే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని జగదీశ్వర్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కారు గుర్తుకే ఓటేద్దాం బీఆర్ఎస్ పార్టీనే గెలిపిద్దాం

- **హైదర్ నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**చేవెళ్ల పార్లమెంట్ లో బీఆర్ఎస్ పార్టీ జెండా రెపరెపలాడాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. శనివారం బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కి మద్దతుగా హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు,నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీని ప్రారంభించారు .ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ కేసీఆర్ ని గుర్తు పెట్టుకొని కారు గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు. ఆరు గ్యారెంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, హామీల అమల్లో విఫలమైందని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ఓట్లు అడిగేందుకు వచ్చే ఆపార్టీ నేతలను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి సమస్య, కరెంటు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. మనమందరం కలిసి కట్టుగా పనిచేస్తే చేవెళ్ల ఎంపీ స్థానం బీఆర్ఎస్ దేనని అన్నారు. అన్నివర్గాల ప్రజలను అక్కున చేర్చుకొని గొప్పగొప్ప సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, శ్రేయభిలాషులు,అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ గణేష్ కు మద్దతు తెలిపిన ఆరోవార్డు ఓటర్లు



**విశాలభారతి, కంటోన్మెంట్ :**కంటోన్మెంట్ కాంగ్రెస్ కు మద్దతు రోజురోజుకు పెరుగుతుంది. కాలనీలో ఉన్న వాసులందరు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారు. స్థానిక ఆరో వార్డుకు చెందిన సీతారాంపురం ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారు. అభ్యర్థి శ్రీగణేష్ కు మద్దతుగా కాంగ్రెస్ ను గెలిపించుకుంటాం అని స్పష్టం చేశారు. ప్రజల కష్టసుఖాల్లో నిలిచే వ్యక్తి శ్రీగణేష్అని పేర్కొన్నారు. నిత్యము అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పకప్పుడు పరిష్కరించే నేత శ్రీగణేష్ అన్నారు.గత 15ఏళ్లుగా ప్రజల మధ్య ఉంటు రాజకీయాలకు అతీతంగా సేవా చేశారని గుర్తు చేశారని కాలనీ ప్రెసిడెంట్ శంకర్ స్పష్టం చేశారు. స్థానికులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసిన తర్వాత తమ నిర్ణయాన్ని ప్రకటించారు.మన అభివృద్ధి కోసం, కాలనీ అభివృద్ధి కోసం శ్రీ గణేష్ ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.15 ఈ కార్యక్రమంలో గడ్డం ప్రవీణ్ కుమార్, యాదవ్ బెల్లంపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు ఓటర్లు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజంకు చెందిన పలువురు గణేష్ అగర్వాల్,సురేష్ శర్మ, మదన్,ప్రవీన్ పాల్గొన్నారు.

# బిజెపితోనే అభివృద్ధి..

- **ప్రపంచ స్థాయిలో భారత్ కు గుర్తింపు తెచ్చింది మోడీయే..**
- **బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గానుగపాటి సూర్యనారాయణ శర్మ.**



**హైదరాబాద్,విశాలభారతి:** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తోనే అభివృద్ధి జరిగిందని ప్రపంచ స్థాయిలో భారత్కు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది మోడీయే అని బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గానుగపాటి సూర్యనారాయణ శర్మ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం ముషీరాబాద్ లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని కోరారు. దేశంలో బిజెపి అధికారంలో ఉంటే జరిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బాబు సుబ్రహ్మణ్యం తో పాటు బిజెపి శ్రేణులు మహిళలు భారీగా పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com





# కాంగ్రెస్ లోకి కొనసాగుతున్న వలసలు

- ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ ను వీడుతున్న నేతలు
- వలసలు ఆపలేక అయోమయంలో బీఆర్ఎస్ లీడర్లు

**భీమదేవరపల్లి విశాల భారతి** లోక్ సభ ఎన్నికల తరుణంలో హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. మండలల్లో బీఆర్ఎస్ క్యాడర్ మూకుమ్మడిగా రాజీనామాలు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో కారు పార్టీ ఖాళీ అవుతుండగా, కాంగ్రెస్ గ్రాఫ్ రోజురోజుకూ పెరుగుతూ పోతుందని నియోజకవర్గంలో టాక్ నడుస్తుంది. నిన్న మొన్నటి వరకు బీఆర్ఎస్ పార్టీలో చక్రం తిప్పిన నేతలు, మాజీ ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరులుగా ఉన్నవారు సైతం కాంగ్రెస్ లో చేరేందుకు క్యూ కట్టారు. ఐతే గతంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి స్థానిక నేతలు, మండల, గ్రామస్థాయి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ పార్టీ అధిష్టానం సూచన మేరకు వచ్చిన వారందరినీ పార్టీలోకి ఆహ్వానిస్తుండడంతో వలసల జోరు కొనసాగుతోంది. ఈ వలసలు గెలుపుకు దారితీస్తుందా లేదో వేచి చూడలంటున్న పలువురు.

# ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలు

- ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా తిరగొద్దు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి



**వనపర్తి విశాల భారతి:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో భాగంగా శనివారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని జిల్లా ఎస్పీ రక్షితకే మూర్తి వెల్లడించింది. శనివారం సాయంత్రం 6 గంటలకు నుంచి 144 సెక్షన్ అమలైందని, ప్రతి ఒక్కరు సహకరించాలి లేనియెడల వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజు నుంచి మరుసటి రోజు వరకు నియోజకవర్గం ప్రజలు కాకుండా ఇతర వాళ్ళు ఉంటే వారి ఊర్లోకి వెళ్లాలని, ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే 100 నెంబర్ కి డయల్ చేసి ఫిర్యాది చేయాలన్నారు. ఫిర్యాదు చేయలేని వారు సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే నేరుగా ఎలక్షన్ కమిషన్ చేరుతుందని సూచించారు.



# తెలంగాణలో మార్పు వచ్చింది

- దేశంలో మార్పు రావాలి
- నరేంద్ర మోడీ తెలంగాణకు చేసింది శూన్యం

**కల్వకుర్తి, విశాల భారతి** 6 నెలల క్రితం తెలంగాణలో మార్పు మొదలైంది. ఇక వచ్చే పార్లమెంట్ ఎన్నికల ద్వారా దేశంలో మార్పు రావాలని ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పది సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన కెసిఆర్ తెలంగాణలో చేసిన అభివృద్ధి శూన్యమని, దుర్మార్గపు పాలనతో ప్రజలను బానిసలుగా మార్చే ప్రయత్నం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పదేళ్ల దుర్మార్గపు పాలనకు తెలంగాణ ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికల్లో చరమగీతం పాడారని అదేవిధంగా దేశంలోని బిజెపి మోడీ ప్రభుత్వాన్ని కూడా ఈ పార్లమెంటు ఎన్నికల ద్వారా దేశ ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని వారు తెలిపారు. దేశంలో ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని దేశ సంపదను దేశ ప్రజలందరికీ అందించే పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వం లోని కాంగ్రెస్ పార్టీ అని వారు కొనియాడారు. తెలంగాణలో 14 కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. కల్వకుర్తి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ మల్లురవికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ ఇందిరా శోభన్, మాజీమంత్రి చిత్తరంజన్ దాస్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ మార్గదర్శకలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**ఇందల్వాయి విశాల భారతి,** ఇందల్వాయి మండల నాయకులకు, ప్రజలకు ముఖ్యంగా యువత ఎక్కువగా గుర్తుపెట్టుకోవాల్సిన విషయము ఈ నెల 13 వ తేదీన పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నిజామాబాద్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు. మే 11న సాయంత్రం 6 గంటల నుండి మే 14 ఉదయం 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున 5 గురు అంత కంటే ఎక్కువగా వ్యక్తులు గుమిగూడి ఉండకూడదు అన్నారు. పోలింగ్ డే మే 13 నాడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ పార్టీకి చెందిన వారైనా కూడా (200) రెండు వందల మీటర్ల లైన్ బయట ఉండాలని అన్నారు. ఎక్కడ కూడా టెంట్లు వేయరాదు, ఓన్లీ ఒక టేబుల్ రెండు కుర్చీలు, గొడుగులు మాత్రమే వేసుకోవచ్చనీ, పార్టీ గుర్తులు, కండువాలు, టోపీలు ధరించి ఉండకూడదన్నారు. పై నిబంధనలు ఎవరైనా అతిక్రమించినచో చట్ట ప్రకారం క్రిమినల్ కేసు లు నమోదు చేయబడతాయని ఎస్సై తెలిపారు.

# మండలంలో 144 సెక్షన్ అమలు



**భీమదేవరపల్లి, విశాల భారతి** ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ఎస్సై సాయిబాబు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి సమావేశాలు ర్యాలీలు చేపట్టవద్దని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయవద్దని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో నలుగురు అంతకు అంతకుమించి గుంపు ఉండకూడదని పేర్కొన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలు గుర్తించమన్నారు. అక్కడ పోలింగ్ రోజు భారీ బందోబస్తు ఉంటుందన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చెప్పారు.

# కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**తొర్రూరు, విశాలభారతి:** ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ మండలంలోని వెలికట్ట, నాంచారి మదూరు, చింతలపల్లి, వెంకటాపురం, హరిపిరాల, అమర్ సింగ్ తండా, దుబ్బ తండా గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో డప్పు చప్పులు, కోలాటాలతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే సామాన్యులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్నారు. ఇందిరమ్మ కుటుంబం ప్రాణాలు కోల్పోయి కాంగ్రెస్ కు అండగా నిలిచారని, అలాంటి కుటుంబానికి అండగా ఉండి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసేందుకు ప్రతి ఒక్కరూ కసిగా పనిచేయాలన్నారు. బిజెపి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ ను తరిమినట్లు మతాల మధ్య చిచ్చు పెడుతూ జిఎస్టి పేరుతో సామాన్యులపై భారం మోపి దేవుళ్ళపై రాజకీయం చేస్తున్న బిజెపి పార్టీకి తరిమి కొట్టాలన్నారు. రాష్ట్రంలో వైయస్సార్ హాయంలో జరిగిన అభివృద్ధి తప్ప కెసిఆర్ హయంలో అభివృద్ధి శూన్యమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన 6 హామీలలో ఇప్పటికే 5 అమలు చేశాడని, మిగిలిన రుణమాఫీని ఆగస్టు 15 లోపు అమలు చేస్తారన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మొద్దన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు పాలకుర్తి నియోజకవర్గం నుండి 50 వేల పైచిలుకు మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం హరిపిరాల గ్రామానికి చెందిన గిరి లింగన్న, తల్లారి సైదులు, వెన్నం బాలాజీ, వేముల హరీష్, వెన్నం శివ, తోట నాగరాజు తో పాటు 30 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, వైస్ ఎంపీపీ ఇట్టే శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉష, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ వల్లపు గోపమ్మ మల్లయ్య, గ్రామాల ఇన్చార్జీలు కందాడి అశోక్ రెడ్డి, వెంకన్న సిద్దయ్య ప్రజలు పాల్గొన్నారు.



# పాలవరంలో జోరుగా ఇంటింటి ప్రచారం

**అనంతగిరి, విశాలభారతి:** రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖామాత్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు పద్మావతిరెడ్డి అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస రెడ్డి ఆదేశానుసారం శనివారం మండల పరిధిలోని పాలవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ సోమవారం నాడు జరుగబోయే నల్గొండ పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి హస్తం గుర్తుపై అధిక సంఖ్యలో ఓట్లు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు రామకోటయ్య, బెల్లంకొండ పరశురాములు, మట్టపల్లి నరేష్, బెల్లంకొండ కిరణ్, మట్టపల్లి శ్రీనివాస్, కాసాని వెంకయ్య, మట్టపల్లి వెంకటాద్రి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అరూరి రమేష్ గెలుపు కాంక్షిస్తూ బీజేపీ భారీ బైక్ ర్యాలీ

**తొర్రూరు, విశాలభారతి:** బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కాంక్షిస్తూ ఈరోజు తొర్రూరు పట్టణంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. స్థానిక మన గ్రోమోర్ సెంటర్ నుండి బస్టాండ్ మీదుగా మున్సిపాలిటీ ఆఫీస్, అంబేద్కర్ సెంటర్ నుండి కూరగాయల మార్కెట్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం మార్కెట్ సెంటర్ వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచ అగ్ర ధేశాల సరసన నిలిచింది అని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎంత విష ప్రచారం చేసినా ప్రజలంతా బీజేపీ పట్ల, నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల నమ్మకంతో ఉన్నారని తెలిపారు. తెలంగాణలో కూడా బీజేపీ పన్నెండు సీట్లు గెలువబోతుంది అని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి స్థానికుడైన అరూరి రమేష్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రధాని నరేంద్ర మోడీ కి కానుకగా అందించాలని పిలుపునిచ్చారు. ఈబైక్ ర్యాలీ లో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి , కౌన్సిలర్ కొలుపుల శంకర్, జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్, జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు, కిన్నెర యాదగిరి, తూర్పాటి పాండు, మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్, గడల శేఖర్, గట్ల భరత్, కాగు నవీన్, జలగం రవి, వినయ్ శర్మ, సంతోష్, విజయ్ కుమార్, నవీన్, సందీప్, శ్రీనాథ్, శ్రీనివాస్ చారి, శివ, సాయి ముకేష్, మెండిస్, జగదీష్, శివ సాయి తదితరులు పాల్గొన్నారు.



# ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది

- ఎర్రబెల్లి దయాకర్ రావు

**తొర్రూరు, విశాలభారతి:** సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తొర్రూర్ పట్టణ కేంద్రం లో బిఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ సాధ్యం కానీ గ్యారెంటీ స్కీములతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం మరో ఆరు నెలల్లో కూలిపోతుందని ప్రజలు అధైర్య పడకూడదని, రేవంత్ రెడ్డి దొంగ హామీలతో సీఎం అయ్యాడని, బిఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు కూడా అదే పడకూడదని కార్యకర్తల పైన ఎలాంటి దాడు జరిగిన ఇక నుండి సహించేది లేదని వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని, మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాల్లో తెలంగాణకు చేసింది ఏమీ లేదని ఈ పార్లమెంట్ ఎలక్షన్ లో ట బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ ని అధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పొనుగంటి సోమేశ్వరరావు, సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, కుర్ర శ్రీను అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రఘువీర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి

- నియోజకవర్గ యూత్ నాయకులు సుబ్బు గౌడ్

**పాలకీడు విశాలభారతి:** రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ &పౌర సరఫరాల శాఖ మంత్రి మరియు నల్గొండ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ శ్రీ కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం, పాలకవీడు మండల ఎంపిపి గోపాల్ నాయక్, జడ్పీటీసీ బుజ్జి మోతీలాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పాలకవీడు మండల అధ్యక్షులు ఎన్.వి సుబ్బారావు గార్ల పిలుపు మేరకు నల్గొండ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి గారి గెలుపు కై పాలకవీడు మండలం కోమటి కుంట గ్రామంలో శుక్రవారం రాత్రి గడప గడపకు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యూత్ నాయకులు సుబ్బు గౌడ్ మాట్లాడుతూ నల్గొండ పార్లమెంట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని, బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, బిజెపి అభ్యర్థి కేసులు తప్పించుకోవడానికి పార్టీ మారాడని, ఆయన ఎమ్మెల్యేగా ఉన్న తరుణంలో కబ్జాలు తప్ప నియోజకవర్గానికి చేసింది శూన్యమే అని, హుజూర్ నగర్ నియోజకవర్గం అభివృద్ధి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తోనే సాధ్యం అని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అంటే కాంగ్రెస్ పార్టీ కంచు కోట అని, నియోజకవర్గం లో భారీ మెజారిటీ వస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రచారం చేసిన వారిలో మండల నాయకులు తోడేటి శ్రీనివాస్ యాదవ్, గొర్రె శ్రీనివాస్ యాదవ్, అవిరబోయిన బుచ్చయ్య యాదవ్, సీనియర్ నాయకులు పెద్దారపు ఆంజనేయులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేకల నాగరాజు యాదవ్, నాయకులు మేకల లక్ష్మినారాయణ యాదవ్, సి.హెచ్ నాగరాజు, గోవింద్ యాదవ్, మైనారిటీ నాయకులు పఠాన్ అర్బాజ్ మరియు పెద్దారపు వెంకయ్య, తొడేటి నాగరాజు, వడిత్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఝాన్సి రెడ్డి

**దేవరుప్పుల, విశాలభారతి:** మాదాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సి రెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1352024 సోమవారం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే గ్రామాల్లోని ప్రస్తుతం ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నల్ల శ్రీరాములు మరియు, ముఖ్య నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీల ఆహ్వాన కార్యక్రమం



**మరిపెడ, విశాలభారతి:** కుడియ తండా గ్రామపంచాయతీ నందు అంగన్వాడి సెంటర్లో గర్భిణీల ఆహ్వాన కార్యక్రమాన్ని గర్భిణీలను ఆహ్వానిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అంగన్వాడి టీచర్ కుమ్మరి కుంట్ల జ్యోతి గర్భిణులకు సూచనలు, సలహాలు చేస్తూ .అంగన్వాడి కేంద్రము నందు గర్భిణీలకు ప్రతిరోజు వారికి అవసరమైన పాలు ,గుడ్లు పోషక ఆహారాలను అందిస్తుందని. తల్లి, బిడ్డల సంక్షేమమే అంగన్వాడి కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశమని, అంగన్వాడి కేంద్రం నందు హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రతిరోజు గర్భిణీలు, పిల్లలు అన్నం తినే ముందు చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారాన్ని తినవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భిణీలు అంగన్వాడీ టీచర్ కుమ్మరి కుంట్ల జ్యోతి, శ్రీలత, అంగన్వాడి హెల్పర్ లక్ష్మి, ఏఎన్ఎం లు సంధ్య ,శ్రీలత, ఆశ వర్కర్ నజీమా, పిల్లలు గర్భిణీలు పాల్గొన్నారు.

# పాలకీడులో వాహనాలు తనిఖీ



**పాలకీడు, విశాలభారతి:** మండలం కేంద్రంలో ఎలక్షన్ లో భాగంగా ఈరోజు పాలకీడులో కేంద్ర బాలాగాలు ఈరోజు ప్రచారం చివరి రోజు కాగా మండలంలో ఎలాంటి గొడవలు జరగకుండా మండలంలోని గ్రామాలలో తిరుగుతూ ప్రజలు భయపడకుండా దైర్యంగా ఉండాలని, అలాగే ప్రతి వాహనం ను తనిఖీ చేసి ఎలాంటి మద్యం, డబ్బులు, ఇంకా ఓటర్లను ఆకర్శించడం కోసం ఇంకా వేరే వస్తువులు ఇతరులకు చేరకుండా ప్రతి వాహనంను తనిఖీ చేసారు. అలాగే పాలకీడు ఎస్ఐ లక్ష్మి నరసయ్య కూడా తన బృందంతో గ్రామాలలో తిరుగుతూ పోలీసులు కేంద్ర బాలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలి అని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర బాలగాలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భువనగిరి పార్లమెంట్ లో బీఆర్ఎస్ విజయం ఖాయం

- నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ విజయం ఖాయమని, లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తున్నారని నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్ అన్నారు. యాచారం మండల కేంద్రంలో శనివారం ఉదయం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదని, బీజేపీ పదేళ్ల కాలంలో భువనగిరి అభివృద్ధికి కృషి చేయలేదని అన్నారు. క్యామ మల్లేష్ కు పదవి లేకపోయినా సమస్యల పరిష్కారంకోసం 30 ఏళ్లుగా కృషి చేస్తున్నారని తనను ఎంపీగా గెలిపిస్తే నిస్వార్థ రాజకీయాలకు పునాదులు వేస్తారని రాజు నాయక్ తెలిపారు.



# విశ్వకర్మల గౌరవం పెంచిన ప్రధాన నరేంద్ర మోడీ

**- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి.**

**హైదరాబాద్,విశాలభారతి:** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ విశ్వకర్మల గౌరవం పెంచారని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కొనియాడారు. రామంతపూర్ లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ఆవరణలో జరిగిన సమావేశానికి మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్, తల్లోజు ఆచారి, కుందారం గణేష్ చారి హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ విశ్వకర్మలను గుర్తించడమే కాకుండా విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించడానికి ఆదేశాలు జారీచేసి అమలు చేస్తున్నారని తెలిపారు. 17 బీసీ కులాలకు విశ్వకర్మ కౌన్సిల్ యోజన స్కీం పెట్టి లక్షలాది మంది బిసిలను అందుకుంటున్నరని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ చారి, తాటికొండ శ్రీరాములు, శంకరాచారి, మనోజ్ చారి, అరవింద్ కుమార్, శ్రీనివాస్ చారి, పాపయ్య, నాంపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.





# రాహుల్ గాంధీని ప్రధానిని చేద్దాం

- కుంట్లూరు లోని అన్ని వార్డుల్లో విస్తృతంగా ప్రచారం
- చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఒక చరిత్రగా నిలవాలి
- రైతులకు మేలు యువతకు ఉద్యోగ కల్పన కాంగ్రెస్ తోనే సాధ్యం
- ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చామ అనుకిరణ్ రెడ్డి

**పెద్ద అంబర్పేట్,విశాల భారతి:** కుంట్లూరు లోని అన్ని వార్డులలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపునకై విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చామ అను కిరణ్ రెడ్డి. చామల గెలుపు రాష్ట్రంలో రికార్డు సృష్టించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిస్తూ చివరి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ ఆ రైతు శ్రేయస్సు కోసం, యువతకు ఉద్యోగ కల్పన కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుంది కావున ఈసారి తప్పకుండా హస్తం గుర్తుకు ఓటు వేసి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాని చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మేనిఫెస్టో లోని ఐదు న్యాయ గ్యారంటీలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియపరుస్తూ రైతు రుణమాఫీ ఉచిత కరెంటు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం లాంటి రాష్ట్ర స్కీములే కాకుండా కేంద్ర స్థాయిలో ఉన్న ఐదు న్యాయ అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియపరుస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేసిన చామ అను కిరణ్ రెడ్డి. గత బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు. సిద్ధాంతాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పార్టీ శ్రేణులు ఉదయ పరుస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చామ విజయ శేఖర్ రెడ్డి జోర్క శ్రీరాములు యూత్ కాంగ్రెస్ నాయకులు కొండల్ గౌడ్ సునీల్ రెడ్డి హరీష్ రెడ్డి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు




# రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

**- అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి రమణ.**

**హైదరాబాద్,విశాలభారతి:** రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్న 100% ఎన్నికల్లో ఓట్లు వేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి రమణ కోరారు. హరిత ప్లాజాలో జి మల్లేష్ ఆధ్వర్యంలో మేధావుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పివి రమణ హాజరై మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి ఒక్కరు రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రిజర్వేషన్స్ రక్షించుకోవాలంటే 100% ఓటింగ్ లో పాల్గొని సరైన వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు. అప్పుడే మనం అనుకున్న దాన్ని నెరవేర్చుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ కార్యనిర్వాక అధ్యక్షురాలు పద్మజ, కే మహేశ్వర రాజ్, జి ఝాన్సీ, రాజేందర్, సిబి ప్రసాద్, డాక్టర్ ఎస్ శ్రీనివాస్, జి అంజయ్య, డాక్టర్ బి జగదీష్, మేడ శీను, ఎస్ గంపన్న, సతీష్ రాథోడ్, సుశీల, బి శేఖర్, వాణి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తుంది

- సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి
- రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలి
- కాంగ్రెస్ పార్టీ యువనేత, ఓయూ ఉద్యమ నాయకులు గోపాల్ దాస్ హరినాథ్



**విశాలభారతి,హైదరాబాద్ :** బిజెపి పార్టీ రిజర్వేషన్లను రద్దుచేసి ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు అన్యాయం చేయబోతుందని కాంగ్రెస్ పార్టీ యువనేత, ఓయూ ఉద్యమ నాయకులు గోపాల్ దాస్ హరినాథ్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమని రేపు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపి అభ్యర్థి కడియం కావ్య ప్రచారంలో పాలకుర్తి నియోజకవర్గంలో ఎంఎల్ఏ ఝాన్సీ యశస్విరెడ్డి ఆవిరామ ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాక్షించారు.

# విపక్ష లీడర్లంతా జైలుకే..

- వన్ నేషన్ వన్ లీడర్ చేసేలా కుట్ర
- యోగీ ఆధిత్యనాథ్ ను కూడా పక్కకు పెడతారు
- 75 ఏండ్లు వస్తే ప్రధాని మోడీ దిగిపోతారా?
- అందరికి ఓ రూల్ మోడీకి ఓ రూలా?
- ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

బీజేపీపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాట్లకు కావాల్సిన సీట్లను బీజేపీ గెలుచుకోలేదని కేజ్రీవాల్ జోస్యం చెప్పారు. తాను తీహార్ జైలు నుంచి విడుదలైన తర్వాత ఎంతో మంది నిపుణులు, సెఫాలజిస్టులతో మాట్లాడనని చెప్పారు. శుక్రవారం కేజ్రీవాల్‌కు ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. దీంతో ఆయన ఢిల్లీలో పార్టీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారం కోల్పోతుందని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లను అంతం చేయాలని, నియంతృత్వాన్ని తీసుకురావాలన్న ఉద్దేశంతో బీజేపీకి 400 సీట్లు కావాలని అంటున్నారని ఆరోపించారు. జూన్ 4న ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందని.. ఢిల్లీకి రాష్ట్ర హోదా కల్పిస్తామని, ఎల్జీని సొంతం చేసుకుంటామని చెపక్పారు. దేవుడు తనకు 21 రోజులు సమయం ఇచ్చాడని.. 24 గంటలు పనిచేస్తానని, దేశమంతా తిరుగుతానని చెప్పారు. ఈ నియంతృత్వాన్ని అంతం చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని కేజ్రీవాల్ ప్రకటించారు. బీజేపీ ఈసారి కర్ణాటక, మహారాష్ట్ర,



రాజస్థాన్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్‌ల లో చాలా సీట్లు కోల్పోనున్నట్లు తెలిసిందన్నారు. ఫోన్‌లో చాలా మంది సెఫాలజిస్టులతో మాట్లాడినట్లు చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరు బీజేపీకి మెజారిటీ రాదనే చెబుతున్నారన్నారు. ఇక ఢిల్లీ విషయానికి వస్తే మొత్తం 7 ఎంపీ సీట్లలో బీజేపీ ఓడిపోతుందన్నారు. ఆప్ తూర్పు ఢిల్లీ లోక్‌సభ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌కు మద్దతుగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి కృష్ణానగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఢిల్లీలోని మొత్తం 7 పార్లమెంట్ స్థానాలకు మే 25న ఓటింగ్ జరగనుంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఏప్రిల్ 1న తీహార్ జైలుకు తరలించారు. దాదాపు 50 రోజుల తర్వాత ఆయనకు విముక్తి లభించింది. మధ్యంతర బెయిల్ దొరకడంతో ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు.




# పీర్జాదిగూడలో కాంగ్రెస్ పార్టీ "భారీ బైక్ ర్యాలీ"

- సునీత మహేందర్ రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తాం
- ప్రచారంలో సైనికుల్లా పనిచేస్తున్న కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు
- తుంగతుర్తి రవి,పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

**మేడిపల్లి,విశాలభారతి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి శ్రీమతి సునీత మహేందర్ రెడ్డి గారికి మద్దతుగా 800 ద్విచక్ర వాహనాలతో భారీ "బైక్ ర్యాలీ" నిర్వహించారు. మేడిపల్లి లోని చేనిగిచర్ల ఎక్స్ రోడ్ నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ మేడిపల్లి ,పర్వతపూర్, పీర్జాదిగూడ,బుధనగర్,మల్లికార్జున నగర్, పి&టీ కాలనీ ల మీదుగా దిగ్విజయంగా కొనసాగింది.ఈ కార్యక్రమంలో లో ముఖ్య అతిథులుగా టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ శాసనసభ్యులు మాలిపెద్ది సుదీర్ రెడ్డి,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,పట్నం సునీత మహేందర్ రెడ్డి కుమార్తె మనీషా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభయహస్తం ఆరు గ్యారెంటీ హామీలు ప్రజలలో విశేషా ఆదరణ పొందుతున్నాయని,అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకి లభిస్తుందని మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో పట్నం సునీత మహేందర్ రెడ్డి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ,గత 20 రోజులుగా ప్రతిరోజు ఎండలను లెక్కచేయకుండా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని,ఈరోజు బైక్ ర్యాలీలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు,ఎన్ ఎస్ యు ఐ నాయకులకు, ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని రవి అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,లీగల్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, దర్గా దయాకర్ రెడ్డి,మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రునాయక్,కార్పొరేటర్లు,కంటెస్టెడ్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వార్డ్ ఇంచార్జ్ లు,కాంగ్రెస్ పార్టీ సీనియర్నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, NSUI నాయకులు, sc సెల్, బీసీ సెల్, st సెల్ నాయకులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# దివంగత నేత శంకర్ గౌడ్ జయంతి వేడుకలు

**- నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ సాయిబాబా**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు,స్వర్గీయ మాజీ శేరలింగంపల్లి టిఆర్ఎస్ ఇంచార్జ్ కొండకల్ శంకర్ గౌడ్ జయంతి వేడుకలను గురువారం గచ్చిబౌలిలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం లో శంకర్ గౌడ్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో శేర్లింగంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ వాణిని దశదిశల చాటిన గొప్ప తెలంగాణ వాదిగా శంకర్ గౌడ్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. తెలంగాణ ఉద్యమంలో అందరినీ మమైక్యమయ్యేలా చేసి స్వరాష్ట్ర సాధనకు టిఆర్ఎస్ పార్టీ రథ సారథి కేసీఆర్ పిలుపు మేరకు ఎన్నో పోరాటాలు,రాస్తారోకోలు చేశారని గుర్తు చేశారు.

# ప్రత్యక్ష దైవం అమ్మ

కని పెంచిన తల్లి గొప్పతనాన్ని గుర్తుచేసుకోవడం కోసం ప్రతి సంవత్సరం మే నెలలోని రెండవ ఆదివారం నాడు అంతర్జాతీయ మాతృ దినోత్సవం జరుపుకుంటారు. 'మదర్ ఆఫ్ గాడ్స్'గా పిలువబడుతున్న రియా దేవతకు నివాళి అర్పించే నేపథ్యంలో ఈ ఉత్సవాన్ని మొదటిసారిగా గ్రీస్ దేశంలో నిర్వహించారు. భూమి మనల్ని మోయకముందే మన అమ్మ మనల్ని తొమ్మిది నెలలు తన కడుపులో మోసి మనకి ప్రాణం పోస్తుంది.,ఈ భూమి మీదికి మన అడుగులు మోపించి, తన పురిటి నొప్పులను సైతం లెక్కచేయకుండా నన్ను ఈ బువిపైకి తెచ్చిన మాతృమూర్తి అమ్మ. అమ్మకడుపులో ఉన్నప్పటి నుండే ఏ మాత్రం కష్టపెట్టకుండా ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసి, ఒక మొక్కను చెట్టులా మారుస్తారు.,

**సృష్టికి ప్రతి సృష్టినిచ్చి...**
**సమాజానికి మార్గ నిర్దేశనం చేసే...**
**ఓ అమ్మ మీకు వందనం.**

వీర్యపు కణం కడుపున పడిన నుండి తన చివరి శ్వాస వరకు నీకోసం తపించే, దారి చూపిన తల్లిదండ్రులను వృద్ధాప్య దశకు చేరుకున్న వారిని పోషించాల్సిన బాధ్యత పిల్లల దేనని మరువకు ఓ మానవా..?

ధనమే సుఖమును భ్రమలో పడి కనులే కనపడక, తల్లిదండ్రులను విడువకు మరువకు. భగవంతుడు ఎక్కడో లేడు ప్రేమతో తన బిడ్డను ముద్దాడే ప్రతి తల్లి లోను కనపడతాడు తల్లిదండ్రులు కనిపించే దైవాలు , బిడ్డల ఆనందమే తమ ఆనందం గా భావించేది తల్లిదండ్రుల ప్రేమ, నీకు స్వచ్ఛమైన ప్రేమ కనిపించేది కేవలం అమ్మా నాన్నల దగ్గరనే.ఈ ప్రపంచంలో ఎక్కడ వెతికినా ప్రేమ లేని అమ్మ.... బాధ్యతలేని నాన్న ఉండరు.... కనుక పిల్లలపై అమ్మానాన్నల ప్రేమ అ అపూర్వమైనది. నీ ప్రతి మలుపు, నీ ప్రతి కష్టసుఖాల్లో తోడుగా నిలిచేది వారే.... నిన్ను ఈ ప్రపంచంలో కి పరిచయం చేసిన అమ్మని, నైతిక విలువలు నేర్పిన నాన్నను, వృద్ధాప్య ఆశ్రమాలకు చేర్చకు. పిల్లల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించి, అంతా కోల్పోయిన వారు, ఇప్పుడు నిరాదరణకు గురవుతున్నారు, కుటుంబ సభ్యులు అదరించక పోవడంతో వృద్ధాశ్రమాలకు చేరుతున్నారు.ఈ సమాజంలో ఏటఏటా వృద్ధ ఆశ్రమాలు పెరుగుతున్నాయి ఆస్తి ఏమి ఇవ్వలేదు అని ఒకరు బరువుగా మారారని మరొకరు కన్నవారిని విడిచి పెడుతున్నారు పిల్లలు సుఖం కోసం ఎన్నో కష్టాలను భరించి ఎన్నో త్యాగాలను చేసిన వారికి నువ్వు ఇదేనా ఇచ్చేది ...? కనిపించిన వారిని బాధ్యతగా ప్రేమగా చూసుకోవాలి మరణించిన తరువాత చితికి నిప్పు పెట్టేవారు కాదు వారసులు అంటే మంచాన పడ్డ రోజు మంచినీళ్లు ఇచ్చి మందు గోలి వేసే వాడే నిజమైన వారసులు కాబట్టి ఇ నీ నిజమైన మానవత్వం చాటుకుని నీ గురించి ఈ లోకం మాట్లాడుతుంది అంటే వారి పుణ్యమే మానవా వారిని మరవకు విడువకు చివరి శ్వాస వరకు క్షేమంగా చూడు......

**కనిపించే దేవత అమ్మ..**

సంసార సాగరంలో మీకు మీరే సాటిగా..., ఓర్పుకు, నేర్పుకు, ఓదార్పునకు అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా... ఆత్మీయతతో అనురాగాన్ని పంచే., అమృత మూర్తీ మీకు వందనం...మారుతున్న మరమనుషుల కాలంలో, మానవత్వం మంటగలుస్తున్న రోజుల్లో., దినదిన గండాల దాష్టీకాల నడుమ., మారాలి మీ నడక., ఎప్పుడూ తడబడక., కావాలి మీరు మరో రుద్రమవి.. అసురుల పాలిట అపర కాళికవిగా.కని పెంచి లోకాన్ని పరిచయం చేసిన అమ్మలకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు..




**జాజుల దినేష్.**
**పొలిటికల్ సైన్స్ లెక్చరర్.**
**9666238266**

# నా చెల్లిని గెలిపించండి

- వైఎస్సార్ మానాన్నకు మంచి ఫ్రెండ్
- ఆయన పేరును మేం చార్జ్ షీట్ లో చేర్చలేదు
- మేం పవర్ లోకి వస్తే పదేండ్లపాటు ప్రత్యేకహోదా
- ఐదేండ్లుగా నిందితుడిని కాపాడుతున్న జగన్
- కడప సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**విశాలభారతి,ఆంధ్ర ప్రదేశ్:**

తన తండ్రికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరుడు లాంటివారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. వాళ్లిద్దరూ అన్నదమ్ముల్లా ఉండేవారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కడపలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఛార్జిషీట్‌లో వైఎస్ఆర్ పేరును కాంగ్రెస్ పార్టీ చేర్చలేదని స్పష్టం చేశారు. ఎవరో వారి స్వలాభం కోసం చేసిన పని ఇది అని వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ విలువలు, సిద్ధాంతాలు పార్లమెంటులో విన



పడాలంటే తన సోదరి వైఎస్ షర్మిలను గెలిపించాలని కోరారు. ఆమెను గెలిపిస్తామని ప్రజలు తనకు మాటివ్వాలన్నారు. అంతకుముందు ఇడుపులపాయలో వైఎస్ఆర్ సమాధి వద్ద రాహుల్ నివాళులర్పించారు.

**భారత్ జోడో యాత్రకు వైఎస్ఆర్ పాదయాత్రే స్ఫూర్తి**

"రాజశేఖర్‌రెడ్డి ఏపీకే కాదు.. దేశం మొత్తానికే దారి చూపించారు. భారత్ జోడో యాత్రకు వైఎస్ఆర్ పాదయాత్రే స్ఫూర్తి. పాదయాత్రల ద్వారానే ప్రజల సమస్యలు తెలుస్తాయని భారత మొత్తం చేపట్టాలని వైఎస్ఆరే నాకు చెప్పారు. తండ్రిలా ఆయన మార్గదర్శనం చేశారు. దిల్లీలో ఏపీ ఆలోచనలను ప్రతిధ్వనించేవారు. వైఎస్ఆర్ సిద్ధాంతమే కాంగ్రెస్ సిద్ధాంతం. రాజశేఖర్‌రెడ్డి సిద్ధాంతం ఎప్పుడూ భాజపాకు వ్యతిరేకమే. జగన్ మాత్రం భాజపాను పల్లెత్తు మాట కూడా అనట్లేదు. అందుకు కారణం.. ఆయనపై ఉన్న అవినీతి కేసులే. విభజన సమయంలో రాష్ట్రానికి కేంద్రం ఎన్నో హామీలిచ్చింది. ప్రత్యేకహోదా, పోలవరం, కడప స్టీల్‌ప్లాంట్.. ఇలా ఎన్నో హామీలు నెరవేరలేదు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఉంటే ఇవన్నీ పూర్తయ్యేవి. మేం అధికారంలోకి వస్తే ఇవన్నీ నెరవేరుస్తాం. పదేళ్ల పాటు ప్రత్యేకహోదా ఇస్తాం.

**మోదీ కొందరినే కోటీశ్వరులను చేశారు**

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విప్లవాత్మక మార్పులు తెస్తాం. రెండు లక్షల రుణమాఫీ, కేజీ టు పీజీ ఉచిత విద్య, యువతకు రెండున్నర లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. పేదలకు రూ.5 లక్షలతో ఇల్లు కట్టిస్తాం. మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.8,500 జమ చేస్తాం. మోదీ కొందరినే కోటీశ్వరులను చేశారు. మేం లక్షలమందిని చేస్తాం. కొందరు మమ్మల్ని పేదలను సోమరిపోతులను చేస్తున్నామంటున్నారు. మోదీ కొందరికి రూ.లక్షల కోట్ల మేలు చేస్తే దాన్ని అభివృద్ధి అంటున్నారు. మేం చేయాలనుకున్నది చేసి చూపిస్తాం. రైతు రుణమాఫీ చేసి తీరుతాం. భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తే ప్రజలు భాజపాకు ఎలా బుద్ధిచెబుతారో చూడండి" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**సీఎం పదవి చేపట్టగానే జగన్ మారిపోయారు..**

కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. వైకాపా పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. "గత ఎన్నికలకు ముందు మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన వైకాపా.. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేస్తోందన్నారు. వాళ్లు ఏ బ్రాండ్ మద్యం అమ్మితే అదే కొనాలి.. తాగాలి. అన్నీ మాఫియాలే.. ల్యాండ్, శాండ్, లిక్కర్. సొంత చిన్నాన్నను చంపిన వారిని జగన్ వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. ఐదేళ్లుగా నిందితుడిని కాపాడటమే కాదు.. మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చారు. ఇలాంటి అన్యాయాలు ఎదుర్కొనేందుకే నేను ఎంపీగా పోటీచేస్తున్నా. సీఎం పదవి చేపట్టగానే జగన్ మొత్తం మారిపోయారు. వివేకా హత్యపై సీబీఐ విచారణ కోరి.. ఆ తర్వాత అవసరం లేదన్నారు

# పోరాడే వ్యక్తులే పార్లమెంట్‌కు వెళ్లాలి

- 2014లో మోదీ ఇచ్చిన హామీలు నెరవేరాయా?
- 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేశారా?
- యువతకు యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా?
- నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఇంటికీ రూ. 15 లక్షలు ఇచ్చారా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

గత ఐదేళ్లలో భాజపా నేత బండి సంజయ్ గల్లీ లోగానీ, దిల్లోలోగానీ ఎక్కడైనా కనిపించారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజల తరపున పార్లమెంట్‌లో వినోద్ గళం విప్పారని గుర్తు చేశారు. హుజూరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగవద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను నెరవేర్చిందా? అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న సవతి తల్లిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. "పోరాడే వ్యక్తులే పార్లమెంట్‌కు రావాలి. కేంద్రం నిధులు రాబట్టే సత్తా వినోద్‌కు ఉంది. మోదీ హయాంలో నిత్యావసరాల ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్‌పై 34 శాతం ధరలు పెంచారు. ముడిచమురు ధరలు తగ్గినా పెట్రో ధరలు మాత్రం తగ్గలేదని కేటీఆర్ అన్నారు.

## 'మోదీ గ్యారెంటీ'పై కేటీఆర్ ట్వీట్

కేటీఆర్ ఎక్స్ (ట్విటర్) వేదికగా మరోసారి బీజేపీకి చురకలంటించారు. 2014లో మోదీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఒక ఆసక్తికర ట్వీట్ చేశారు. 'మోదీ గ్యారెంటీ' అనే బీజేపీ నినాదం నవ్వు తెప్పిస్తోందని కేటీఆర్ అన్నారు. 2014లో ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చారా అని ప్రశ్నించారు. "2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేశారా? యువతకు యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా? 2022 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను రెట్టింపు చేసి 5 ట్రిలియన్ డాలర్లకు చేర్చారా? బుల్లెట్ రైళ్లు తీసుకొచ్చారా? ప్రతి ఇంటికి తాగునీరు, కరెంట్, టాయిలెట్ ఇచ్చారా? నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఇంటికీ రూ. 15 లక్షలు ఇచ్చారా? మోదీ జీ మీ గ్యారెంటీ ఏమయ్యిందో దేశం తెలుసుకోవాలనుకుంటోంది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

దళిత కార్యకర్త ఇంట్లో భోజనం

కేటీఆర్ మంచిర్యాల జిల్లా చెన్నూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ప్రసంగించారు. చెన్నూరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ ముగిసిన అనంతరం దళిత బీఆర్ఎస్ కార్యకర్త ప్రశాంత్ ఇంట్లో కేటీఆర్ భోజనం చేయడం ప్రత్యేకత సంచరించుకుంది. పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ , మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్తో కలిసి భోజనం చేసినా అనంతరం ప్రశాంత్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఫోటోలు దిగారు. అంతకుముందు పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్కు మద్దతుగా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో 12 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.





# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

- కాంగ్రెస్ గెలిస్తేనే పేదల బతుకులు మారుతాయి
- బీజేపీ, బీఆర్ఎస్ లను నమ్మితే మోసపోతాం
- కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించండి
- కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇంచార్జ్ హనుమాండ్ల ఝూన్సీ రెడ్డి

**పాలకుర్తి, విశాల భారతి :**

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝూన్సీ రెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా శనివారం ఝూన్సీ రెడ్డి రాయపర్తి మండలంలోని కొండాపురం గ్రామంలో పర్యటించి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదలు చాలామంది ఉన్నారని, వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఝూన్సీ రెడ్డిని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు అశోక్ కోరగా.. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం ఝూన్సీ రెడ్డి మాట్లాడుతూ.. కొండాపురం గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని హామీ ఇచ్చారు. గ్రామంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, మిగతా పథకాలు కూడా ఇస్తామని అన్నారు. గ్రామంలోని నిరుద్యోగ యువకులకు తమ ట్రస్ట్ ద్వారా ఉపాధి కల్పిస్తామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను గోరంగా మోసం చేశాయని అన్నారు. గత పది ఏళ్లుగా అధికారంలో ఉన్న ఆ పార్టీలు ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. కేంద్రంలో మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని, రిజర్వేషన్లు తీసివేస్తారని హెచ్చరించారు. అలాగే బీఆర్ఎస్ కు ఓటేస్తే రాష్ట్రాన్ని ఇంకా అప్పుల్లో ముంచుతారని అన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు మారుతాయని అన్నారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉపాధి హామీ లాంటి ఎన్నో పథకాలు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేస్తామని, అలాగే మిగిలిన 6 గ్యారెంటీలను పూర్తి చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎన్ని డ్రామాలాడినా ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీదే విజయం అని అన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించి రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, కొండాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖదీర్ పాషా, ప్రధాన కార్యదర్శి రాధారపు రాజు కన్నెబొయిన కుమారస్వామి, మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ పాషా, వికలాంగుల ఫోరం జిల్లా అధ్యక్షులు పిన్నింటి రవి,బూత్ కమిటీ సభ్యులు సోని,కాంగ్రెస్ నాయకులు చకిలేల శ్రీనివాస్, కన్నెబోయిన సింహాద్రి, బలగం యాకయ్య, కేశ బోయిన దూడయ్య, ఎద్దు బచ్చయ్య, పి.సోమయ్య, నూనె సుమన్, కొండ యాకయ్య, కనుకుంట్ల లక్ష్మణ్ ,సంతోష్, అవి రెండ్ల పెద్ద లింగం, పెద్దగోని అనిల్,దురిశెట్టి మురళి,అవిరెండ్ల అశోక్,గాదె ఉప్పలయ్య, మేడి వెంకన్న, పెద్ద ఎత్తున యువకులు, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ పార్టీ పక్షాన పటాన్ చెరు ఎమ్మెల్యే కాట శ్రీనివాస్ గౌడ్

- కాట శ్రీనివాస్ గౌడ్ ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే నిధుల వరద పారేది
- రామ లక్ష్మణులుగా కలిసి పని చేయండి..
- మీ రాజకీయ భవిష్యత్తుకు బాధ్యత మాది
- కాట శ్రీనివాస్ గౌడ్, నీలం మధుకు సిఎం భరోసా
- పటాన్ చెరు నుంచి నీలం మధుకు 50 వేల మెజారిటీ ఇస్తారన్న నమ్మకం వచ్చింది
- ఈ ప్రాంతం అభివృద్ధి కోసం నీలం మధును గెలిపించండి
- పటాన్ చెరు రోడ్ షోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పాల్గొన్న మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ

**పటాన్ చెరు, విశాలభారతి:**

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పట్టణంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీఎస్ఐఐసి చైర్మన్ నిర్మల హాజరయ్యారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందు పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని, దినదినాభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఏర్పడుతున్న నూతన కాలనీలకు మిషన్ భగీరథ నీళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రత్యేక నిధులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కాట శ్రీనివాస్ గౌడ్ ఈ ప్రాంత అభివృద్ధి చేయాలని కోరడంతో పాటు పలు సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారని, కాట శ్రీనివాస్ గౌడ్ ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఈ బాధలు తప్పేవి..ఈ ప్రాంతానికి నిధుల వరద పారేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన పటాన్ చెరు ఎమ్మెల్యే కాట శ్రీనివాస్ గౌడ్ అని సిఎం స్పష్టం చేశారు. నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్ ఇద్దరూ జోడెద్దుల్లా, రామలక్ష్మణులుగా కలిసి పని చేయాలని సూచించారు. మీరిద్దరి రాజకీయ భవిష్యత్తుకు, మీ అవకాశాలను చక్కదిద్దే బాధ్యత తను తాను, మంత్రి దామోదర్ రాజనర్సింహ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. కింద భూమి నుంచి సెగలు వస్తున్నా..పైనుంచి భానుడు తన ప్రతాపం చూపిస్తున్నా..మండేటెండలో నిలబడ్డ వేలాది మందిని కార్యక్రమంలో చూసిన తర్వాత పటాన్ చెరు నియోజకవర్గం నుంచి నీలం మధుకు తప్పకుండా 50 వేల మెజారిటీ ఇస్తారని నాకు సంపూర్ణ నమ్మకం వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. సమస్యలపై చట్టసభల్లో మాట్లాడాలన్నా, కేంద్ర నిధులు తీసుకురావాలన్న, ఈ ప్రాంతానికి గోదావరి జలాలు రావాలన్నా, మెట్రో రైలు తేవాలన్నా నీలం మధును ఎంపీగా గెలిపించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు.





## నన్ను ఆశీర్వదించి గెలిపించండి: ఎంపీ అభ్యర్థి నీలం మధు

ఈ పార్లమెంట్ ఎన్నికలలో తనను ఆశీర్వదించి, గెలిపించాలని ఎంపీ అభ్యర్థి నీలం మధు ప్రజలను కోరారు. పటాన్ చెరు కార్నర్ మీటింగులో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు పోటీ నుంచి పోటీ చేసే అవకాశం కాంగ్రెస్ అధిష్టానం తనకు కల్పించిందని తెలిపారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే సీఎం రేవంత్ సహకారంతో, కేంద్రం నిధులతో పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.


# పవన్ కళ్యాణ్‌కు మెగా అండదండలు..





ఎన్నికలకు సమయం దగ్గర పడుతూ ఉండడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిస్థితులు మరింత ఉత్కంఠంగా మారుతున్నాయి. మరికొన్ని గంటల్లోనే ఫలితాలు తారుమారు అవుతాయి అనే విధంగా కూడా కామెంట్ వస్తూ ఉన్నాయి. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పిఠాపురంలో తప్పకుండా గెలవాలి అని ఆయన కుటుంబ సభ్యులు ఏ స్థాయిలో కోరుకుంటున్నారో ఈపాటికే అర్థమయింది. ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది ప్రముఖులు పవన్ కళ్యాణ్ కు మద్దతు ఇస్తున్న విషయం తెలిసిందే. ఒక విధంగా ఎన్నికల్లో కంటే ఈసారి ఎక్కువ స్థాయిలోనే పవన్ కు విజయం సాధించాలని కోరుకుంటున్నారు. అల్లు అర్జున్ కూడా సోషల్ మీడియాలో తన సపోర్ట్ అందించాడు. ఇక మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ కూడా పవన్ కళ్యాణ్ ను కలవబోతున్నట్లు ఇదివరకే కథనాలు వచ్చాయి. చిరంజీవి తన తమ్ముడికి సపోర్టు ఇచ్చినప్పటికీ పాలిటిక్స్ అనే అంశానికి ఆయన కాస్త దూరంగానే ఉంటున్నారు. ఇక మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ తన తల్లి సురేఖ తో కలిసి పవన్ ను పిఠాపురంలో ప్రత్యేకంగా కలుసుకున్నారు. వీరితో పాటు అల్లు అర్జున్ కూడా తన బెస్ట్ విషెస్ ను అందించారు. అందుకు సంబంధించిన ఫోటోలు వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రామ్ చరణ్ రాగానే అక్కడికి వేలాదిమంది జనసైనికులు వచ్చారు. ఇక వారికి ఎంతో ఆప్యాయంగా అభివాదం తెలిపిన రాంచరణ్ తన సపోర్ట్ ఎల్లప్పుడూ బాబాయ్ కి ఉంటుంది అని చెప్పగానే చెప్పేసాడు. పవన్ కళ్యాణ్ చిరంజీవి భార్య సురేఖ గారిని తల్లిగా భావిస్తూ ఉంటాడు. పడింది ఆమె గతంలో పార్టీ కోసం సహాయం కూడా చేశారు. ఇక అల్లు అరవింద్ కూడా సపోర్ట్ చేయడంతో మెగా ఫ్యాన్స్ ఫ్యామిలీ మొత్తం కూడా పవన్ వైపు నిలబడినట్లుగా అర్థమవుతుంది. ఇక పవన్ కళ్యాణ్ రామ్ చరణ్ ఒకే ఫ్రేమ్ కనిపించడంతో ఆ ఫోటోలు కూడా ఫ్యాన్స్ కు మంచి కిక్ అయితే ఇస్తున్నాయి. అయితే ఒక ఫొటోలో పవన్ కళ్యాణ్ కాలికి కాస్త గాయం అయినట్లు కూడా అనిపిస్తుంది. ఒక ఫోటోలో పవన్ కాలికి కట్టు కట్టినట్లు ఉంది. అయితే ఎక్కడ పవన్ దాన్ని హైలెట్ చేసుకోలేదు. మొత్తానికి పవన్ కు మెగా ఫ్యామిలీ నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. మరి ఈ ప్రభావం రాజకీయంగా ఆయనకు ఎంతవరకు హెల్ప్ అవుతుందో చూడాలి.

# సుధీర్ బాబు బర్త్ డే స్పెషల్ 'హరోం హర' నుంచి పాట విడుదల



హీరో సుధీర్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'హరోం హర' మేకర్స్ మురుగడి మాయ అనే కొత్త పాటను విడుదల చేశారు. టైటిల్ సూచించినట్లుగా, ప్రపంచంలో జరిగే ప్రతిచర్యకు కారణమైన మురుగన్ శక్తిని ఈ పాట నిర్వచిస్తుంది. చైతన్ భరద్వాజ్ స్కోర్ చేసిన ఈ మెస్మరైజింగ్ నెంబర్ సుధీర్ బాబు, సునీల్ స్నేహాన్ని చూపుతుంది. రఘు కుంచె ఆ పాటను అద్భుతంగా పాడారు. భరద్వాజ పాత్రుడు కుప్పం యాసలో ఆకట్టుకునే లిరిక్స్ రాశారు. మొత్తంమీద, మురుగడి మాయ అద్భుతమైన కంపోజిషన్, అర్థవంతమైన సాహిత్యం, ఆకట్టుకునే వోకల్స్ తో ఇన్స్టంట్ హిట్ అయ్యింది. సుధీర్ బాబు , సునీల్ బాండింగ్ మరింత ఇంపాక్ట్ ని క్రియేట్ చేసింది. ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్న యాక్షన్ థ్రిల్లర్‌కు సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో 1989లో జరిగిన ఈ పీరియాడికల్ ఫిల్మ్‌లో మాళవిక శర్మ కథానాయిక. అరవింద్ విశ్వ నాథన్ సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ రవితేజ గిరిజాల. పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మే 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# తొలి రోజు మంచి కలెక్షన్స్ 'కృష్ణమ్మ'




వెర్సటైల్ హీరో సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి. గోపాలకృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ పతాకంపై కృష్ణ కొమ్మలపాటి ఈ మూవీని నిర్మించారు. ఎన్నో సక్సెస్‌ఫుల్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ సినిమాను మే 10న భారీ ఎత్తున విడుదల చేశాయి. సత్యదేవ్‌లోని నటుడిని కొత్తగా ఆవిష్కరించిన చిత్రంగా కృష్ణమ్మ మనన్నలు అందుకుంటోంది. సినిమాలో సత్యదేవ్ రగ్డ్ లుక్, రస్టిక్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. సత్యదేవ్ సినీ కెరీర్లో 'కృష్ణమ్మ' సినిమా ఓ రికార్డ్ క్రియేట్ చేసింది. తొలి రోజునే 1 కోటి రూపాయల గ్రాస్ వసూళ్లను సినిమా రాబట్టుకుంది. ఓ వైపు ఎన్నికలు, మరో వైపు ఐపీఎల్ క్రికెట్ ఫీవర్ నేపథ్యంలో విడుదలైన 'కృష్ణమ్మ'కు మంచి కలెక్షన్స్ రాబట్టుకోవటం మంచి పరిణామం. సత్యదేవ్ కెరీర్ లో బెస్ట్ మూవీ ఓపెనింగ్ కలెక్షన్స్ ఇవే. 'కృష్ణమ్మ' సినిమాకు ఇటు ప్రేక్షకుల నుంచే కాదు, అటు విమర్శకుల నుంచి కూడా మంచి ప్రశంసలు దక్కాయి. మంచి మౌత్ వచ్చింది. దీంతో సినిమా మంచి వసూళ్లను రాబట్టుకుంది. మే నెలాఖరు వరకు పెద్దగా రిలీజెస్ లేనందు వల్ల కృష్ణమ్మ సినిమా బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని సాధిస్తుందనటంలో సందేహం లేదు. ప్రేక్షకులను చక్కటి యాక్షన్ ఎలిమెంట్స్ తో ఆకట్టుకుంటూ థియేటర్స్ లో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది కృష్ణమ్మ.



# కాబోయే వాడు ఎలా ఉండాలో చెప్పిన కృతి

1-నేనొక్కడినే-

ఆదిపురుష్ లాంటి భారీ చిత్రాల్లో నటించింది కృతి సనోన్. మహేష్- ప్రభాస్ - నాగచైతన్య (దోచేయ్) లాంటి స్టార్ల సరసన నటించింది. కానీ టాలీవుడ్ సినిమాలేవీ తనకు కలిసి రాలేదు. కానీ హిందీలో వరుస విజయాలు అందుకుని ప్రస్తుతం అక్కడ ప్రామిస్సింగ్ నటిగా ఓ వెలుగు వెలుగుతోంది. మరోవైపు కృతి వ్యక్తిగత జీవితం.. ప్రేమాయణాలు హాట్ టాపిక్ గా మారాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో కృతి సనన్ లండన్‌లోని వ్యాపారవేత్త కబీర్ బహియాతో జంటగా షికార్ చేస్తున్న ఫోటో ఒకటి అంతర్జాలంలో వైరల్ అయింది. ఈ ఫోటో లీక్ తో కృతి డేటింగ్ పై ఊహాగానాలు మొదలయ్యాయి. ఆ ఫోటోలో ఉన్నది తానేనని కృతి అంగీకరించనప్పటికీ ఇటీవల ఆదర్శ భాగస్వామి ఎలా ఉండాలనే దానిపైనా ముచ్చటించి ఆశ్చర్యపరిచింది. తన ఆదర్శ భాగస్వామి తనను నవ్వించే వ్యక్తిగా ఉండాలని.. నిజాయితీపరుడై ఉండాలని అంది. తాజా ఇంటర్వ్యూలో కృతి తన ఆదర్శ భాగస్వామిలో ఎలాంటి లక్షణాలు ఉండాలో వెల్లడించింది. కాబోయేవాడి గుణగణాలు ఎలా ఉండాలో వర్ణించింది. వాటన్నింటికీ అబ్బాయి సరిపోతాడా లేదా అనేది నాకు తెలియదు.. కానీ ఇలా ఉండాలి అంటూ చిట్టా విప్పింది. ఆపై కృతి చాలా సరదాగా నవ్వేసింది. అయితే ఎవరిపైనా ఒత్తిడి చేయనని అంది. "నాకు ఇది కావాలి.. అది కావాలి అని అడగను. నిజానికి ఇలాంటి కోరికలతోనే మనం చాలా ఒత్తిడికి లోనవుతున్నాము. మనకు కావలసినది.. నిజానికి భిన్నంగా ఉండవచ్చు. నాకు అలాంటి వ్యక్తి కావాలని అనిపించవచ్చు.. కానీ వాస్తవానికి నాకు అతడి నుంచి అవసరమైనది సింప్లిసిటీ... నిజాయితీ.. నన్ను నవ్వించగలగాలి.. నన్ను నా పనిని గౌరవించే వారితో గంటల తరబడి మాట్లాడగలను.. ఇలాంటివి గ్రహించాలని నేను భావిస్తున్నాను. ఎవరైనా నాతో సరిపోలాలని నేను అనుకోను.. కానీ మరింత ముఖ్యమైన విషయం.. అతడు కచ్చితంగా సురక్షితంగా చూసుకునేవాడై ఉండాలి! అని కృతి కాబోయేవాడిలో ఉండాల్సిన క్వాలిటీస్ గురించి మాట్లాడింది.

# కాజల్ అగర్వాల్ "సత్యభామ" నుంచి థర్డ్ సింగిల్



'క్వీన్ ఆఫ్ మాసెస్' కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ లో నటిస్తున్న సినిమా "సత్యభామ". నవీన్ చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. "మేజర్" చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు. "సత్యభామ" సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు "సత్యభామ" సినిమా నుంచి థర్డ్ సింగిల్ 'వెతుకు వెతుకు..' రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. ఈ పాటను ఈ నెల 15వ తేదీన విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. నేరస్తులను పట్టుకోవడంలో పోలీస్ ఆఫీసర్ గా సత్యభామ చేసే సెర్చింగ్ నే ఈ పాటకు నేపథ్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా రిలీజ్ చేసిన టీజర్, లిరికల్ సాంగ్స్ తో "సత్యభామ" సినిమా మీద మంచి ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.